Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 174 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 జూలై 2024 మంగళవారం పేజీలు : 4

## డిసెంబరులోగా బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు!

న్యూఢిల్లీ : జేపీ నడ్డా స్థానంలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. డిసెంబరు నెలాఖరులోపు కొత్త సారథి ఎన్నిక పూర్తికానుంది. ఆయన పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. ఎన్నికల నేపథ్యంలో గత నెల వరకు పొడిగింపు లభించింది. అది కూడా ముగియడంతో కొత్త అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు ఆగస్టు 1న ప్రాథమిక సభ్యత్వ నమోదుతో శ్రీకారం చుడతారు. సెప్టెంబరు 15 వరకు ఇది కొనసాగుతుంది. సెప్టెంబరు 16 నుంచి 30 వరకు క్రియాశీల సభ్యత్వ ప్రక్రియ కొనసాగుతుంది.

బీజేపీ నియమావళి ప్రకారం.. ప్రతి సభ్యుడు తొమ్మిదేళ్లకోసారి తప్పనిసరిగా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి. ఈ ఏడాది ప్రధాని మోదీ సహా పార్టీ నేతలంతా రెన్యువల్ చేసుకోవలసి ఉంటుంది.

# అన్నదాతకు శుభవార్త!

## రూ.2 లక్షల వరకు రుణమాఫీ.. గైడ్ లైన్స్ ఇవే..!!




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్ట్ 15వ తేదీ లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆ క్రమంలో రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది.

**మార్గదర్శకాలు :** రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2.00 లక్షల వరకు పంట రుణ మాఫీ వర్తిస్తుంది. స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తిస్తోందని షరతు విధించారు. రాష్ట్రంలో గల షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, బ్రాంచ్‌ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 12-12-2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేదా రెన్యువల్ అయిన రుణాలకు, 09-12-2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 09-12-2023 వరకు బకాయి ఉన్న అసలు, వడ్డీ మొత్తం రుణ మాఫీ పథకానికి అర్హత కలిగి ఉంటుంది. రైతు కుటుంబం నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ ఆహార భద్రత కార్డు (పీడీఎస్) డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. ఆ కుటుంబంలో ఇంటి యజమాని, జీవిత భాగస్వామి, పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు.

**డీఓఏ ఆధ్వర్యంలో :** వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి.

**నోడల్ అధికారి :** పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్) నియమిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.



## మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుంది..

### రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గౌడన్నల పట్ల సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా ప్రవర్తించాడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గంటల తరబడి గౌడన్నలను చెట్ల మీద ఉంచడం సరికాదన్నారు. మానవత్వం ఉన్న నాయకుడెవరూ ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడడు అని నిప్పులు చెరిగారు కేటీఆర్. గౌడన్నలను ఆ చెట్ల మీద అంతంతసేపు నిలబెట్టి, వారి వృత్తి మీద చౌకబారు జోకులు వేస్తూ, దాన్ని ప్రచారానికి వాడుకోవడం అమానవీయం, దుర్మార్గం అని ధ్వజమెత్తారు. మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుంది అని మీ మతిలేని చర్యలు చూసి తెలంగాణ ప్రజలకు అర్థమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

**గౌడన్నలకు అధునాతన మోకులు.. బీఆర్ఎస్ హయాంలోనే రూపకల్పన...** తాటిచెట్టుపై నుంచి పడి ప్రతి సంవత్సరం ఎంతోమంది కల్లుగీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వాటి నివారణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సేఫ్టీ మోకులు రూపొందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బీసీ సంక్షేమశాఖకు బాధ్యతలు అప్పగించి దాదాపు రూ. 8 కోట్లు కేటాయించింది. బీసీ సంక్షేమశాఖ ఆ బాధ్యత ను ఓ ఏజెన్సీకి అప్పగించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆ ఏజెన్సీ సేఫ్టీ మోకులను రూపొందించింది. అప్పుడే వాటిని పంపిణీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. ఇప్పుడు 'కాటమయ్య రక్షణ కిట్లు' పేరిట కాం గ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నవి అవే. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి అందించాలని ల క్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సేఫ్టీమోకు రూ. 9 వేలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.



## తెలంగాణలో ఓ లెక్క ప్రకారమే భూముల రేట్ల పెంపు

హైదరాబాద్ : రాష్ట్రంలో భూముల మార్కెట్ వాల్యూ పెంపుతో ఏటా రూ.4 వేల కోట్లు అదనంగా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. బహిరంగ మార్కెట్?లో అమ్మకాలు, కొనుగోళ్ల ధరల ప్రకారం భూముల మార్కెట్ వాల్యూ శాస్త్రీయంగా ఉండేలా అధికారులు పెంపు ప్రతిపాదనలు రెడీ చేస్తున్నారు. ఇప్పటికే వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ పెంపుపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్?లో సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు, ఏఐజీలు, జాయింట్ ఐజీలు, డీఐజీలు వివరాలు తీస్తున్నారు. ఎక్కడ ఎంత పెంపు అవసరం ఉంది? ఏ మేరకు పెంచాలనే దానిపై లెక్కలు వేస్తున్నారు.

ఎన్నికల కోడ్ తర్వాత భూముల విలువ పెంపుపై ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వనున్నట్టు తెలిసింది. తర్వాత ఆ ప్రతిపాదనలపై ప్రజల నుంచి అభిప్రాయాలు, ఫిర్యాదులు తీసుకోనున్నారు. ఇందుకు కనీసం నెల సమయం తీసుకుంటారు. పూర్తి స్థాయిలో అంతా ఓకే అని నిర్ధారణకు వచ్చాక.. భూముల విలువ పెంపును అధికారికంగా ప్రకటించనున్నారు. జులై నెలాఖరులో లేదా ఆగస్టు మొదటి తేదీ నుంచి పెంచే భూముల విలువలు అమల్లోకి వస్తాయని సెక్రేటరియెట్?లో ఉండే ఉన్నతాధికారి ఒకరు 'వెలుగు'కు తెలిపారు. బహిరంగ మార్కెట్ రేటుకు.. ప్రభుత్వ మార్కెట్ వాల్యూకు ఎక్కడెక్కడ ఎక్కువ వ్యత్యాసం ఉన్నదనే దానిపై ముందు వివరాలు సేకరిస్తున్నారు. అక్కడ ఎంత పెంచాలి? కొంచెం అటు ఇటుగా ఉన్నదగ్గర ఎంత పెంచాలనే దానిపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేస్తున్నది.

**2021, 2022లో సవరణలు...** రాష్ట్రంలో 2021 జులైలో భూముల విలువలను, స్టాంప్ డ్యూటీ సవరించారు. ఆ తర్వాత మళ్లీ 2022లో భూముల విలువల్లో మార్పులు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం రూ. 18,500 కోట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా వస్తాయని అంచనా వేసింది. గతేడాది ఇంతే మొత్తం అంచనా వేయగా రూ. 14,300 కోట్లకే పరిమితమైంది. దీంతో ఈ గ్యాప్?ను పూడ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ల ఫీజులు పెంచనున్నారు. వివిధ ప్రాంతాల్లో సాగు, సాగేతర భూములకు ప్రస్తుతం వాస్తవంగా ఉన్న విలువ, ఎంత మేరకు పెంచడానికి వీలున్నదనే విషయాలపై స్టడీ చేస్తున్నారు. అపార్టుమెంట్లు, నివాస గృహాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేస్తున్న ధరలు, మార్కెట్‌లో వాస్తవంగా ఉన్న విలువలను కూడా స్టడీ చేస్తున్నారు. అయితే ఇష్టారీతిన కాకుండా ఒక పద్దతిలో పెంచాలని భావిస్తున్నారు. ఉదాహరణకు జుబ్లీహిల్స్, బంజరాహిల్స్, గచ్చిబౌలి ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ వాల్యూ గజం లక్ష.. లక్షన్నర రూపాయాలు ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో గతంలోనే పెంచిన ప్రభుత్వ మార్కెట్ వాల్యూతో లక్షకు చేరువైంది. ఇప్పుడు దానిని ఇంకొంత పెంచుతారు. ఇలా సంపన్నులు, ఆ స్థాయిలో కొనుగోళ్లు, అమ్మకాలు జరిగే ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ మార్కెట్ వాల్యూ పెంచేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక మిడిల్ క్లాస్ ఏరియాలు, బస్తీల్లో అపార్ట్?మెంట్లకు బహిరంగ మార్కెట్ వాల్యూలో కనీసం 60 శాతం నుంచి 70 శాతం ప్రభుత్వ మార్కెట్ వాల్యూ ఉండేలా సవరణ చేయనున్నట్లు తెలిసింది. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, పట్టణ ప్రాంతాలు, పారిశ్రామిక ఏరియాలు, డెవలప్‌మెంట్ జరిగే ప్రాంతాలు అంటూ విభజన చేసుకుని మార్కెట్ వాల్యూ సవరించేందుకు సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు ప్రతిపాదనలు రెడీ చేస్తున్నారు. పేపర్ వర్క్ పూర్తి కాగానే.. కమిటీల వారీగా ఫీల్డ్ విజిట్ చేసి మరోసారి నిర్ధారణ చేసుకోనున్నారు.

**ఒక్కసారి పెంపుతో అమాంతం పెరిగిన ఆదాయం...** ఉమ్మడి ఏపీలో 2013లో చివరి సారి ఫీజుల పెంపు జరిగింది. దాని ప్రకారం మార్కెట్ విలువపై రిజిస్ట్రేషన్ ఫీజు 6 శాతంగా ఉండేది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఫీజులను 2021లో సవరించారు. స్టాంపు డ్యూటీ 5.5 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5, రిజిస్ట్రేషన్ ఛార్జీలు 1.5 శాతం కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు మార్కెట్ విలువలో 7.5 శాతంగా ఉంది. వ్యవసాయ భూములకు ఎకరాకు కనీస ధర రూ. 75 వేలు, ఖాళీ స్థలాలకు చదరపుగజం చొప్పున, నివాసాలకు చదరపుఅడుగు చొప్పున కనీస ధర నిర్ణయించి మార్కెట్ విలువ పెంచారు.

2020u21లో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 5,260 కోట్ల రాబడి వచ్చింది. 2021 జులైలో మార్కెట్ ధరల సవరణతో 2021u22లో రూ. 12,370 కోట్లకు చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లాల్లో బహిరంగ మార్కెట్లో భూముల ధరలు రూ.కోట్లలో పలుకుతున్నాయి. ప్రభుత్వ మార్కెట్ ధర మాత్రం ఆ స్థాయిలో ఉండటం లేదు. దీంతో పెద్ద ఎత్తున ప్రభుత్వం రాబడి కోల్పోతున్నదన్న చర్చ వినిపిస్తున్నది. ఈ క్రమంలో ప్రభుత్వం మార్కెట్ విలువ సవరించడం ద్వారా ఖజానాకు రూ. 4 వేల కోట్లకు పైగా రాబడి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

# ఆగస్టు నాటికి రైతులకు రుణమాఫీ

## రైతు భరోసాపై అభిప్రాయాలను తెలుసుకుంటున్నాం



### రైతు భరోసా వర్క్‌షాప్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హనుమకొండ : రైతు భరోసా పథకం అమలుపై తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. రైతు భరోసా 5 ఎకరాలకు ఇవ్వాలా, 10 ఎకరాల వరకు ఇవ్వాలనే అంశంపై క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకుంటుంది. ఉమ్మడి జిల్లాల వారీగా రైతు భరోసాపై ప్రభుత్వం వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రైతులతో సమావేశమై వారిచ్చే సలహాలు, సూచనలను కూడా మంత్రి వర్గ ఉప సంఘం ఆచరణలోకి తీసుకుంటుంది. ఈ రోజు వరంగల్‌లో రైతు భరోసాపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. రైతు భరోసా పథకానికి సంబంధించి విధి, విధానాలపై మంత్రులు ఈ సమావేశంలో చర్చించారు. ఈ కమిటీ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులు, సాగు విస్తీర్ణం, రైతాంగ స్థితిగతులపై అధ్యయనం చేస్తుంది. అయితే రైతులతో చర్చించిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు కీలక విషయాలు మీడియాకి వెల్లడించారు. రైతు భరోసా సదస్సులో పాల్గొన్న రైతుల అభిప్రాయం క్రోడీకరిస్తామని తెలిపారు. అందరి సూచనలు నోట్ చేసుకున్నామన్నారు. అన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తుందని అన్నారు. అందరి అభిప్రాయానికి తగినట్టుగా సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వరంగల్ నుంచే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతు భరోసా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ లాంటి పథకాలు అమలు చేశామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు ఒక సారి ఇచ్చామని.. ఇప్పుడు రైతు భరోసాపై అమలుకు విధి విధానాల రూపకల్పన కోసం విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో ఒక రోజంతా చర్చిస్తామని అన్నారు. రైతులకు అందించే భరోసా సొమ్ము ప్రజలు టాక్స్ రూపంలో చెల్లించినవేనని అన్నారు. అందుకే ప్రతి పైసా సక్రమంగా వినియోగం కోసం అన్నివర్గాల నుంచి సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఇన్సురెన్స్ కంపెనీలతోను చర్చలు జరుపుతున్నారని వివరించారు. తమ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చేశామని రైతులు స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. రైతుల అభిప్రాయాలు క్రోడీకరించి శాసన సభలో చర్చిస్తామని అన్నారు. చర్చించిన తర్వాతే రైతు భరోసా అమలు చేస్తామని అన్నారు. వచ్చే ప్రతీ చిన్న ఆదాయాన్ని పోగుచేసి ప్రజలకే పంచుతామని చెప్పారు. ప్రజల అభిప్రాయమే గవర్నమెంట్ జీవోగా వస్తుందని చెప్పారు. త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతున్నామని అన్నారు. రైతు భరోసాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు..

# సంపాదకీయం

## సింపతీ పాలిటిక్స్

### ట్రంప్‌కు రాజకీయ హైవే!!

తాజాగా అమెరికాలో జరిగిన దుండగుడి కాల్పుల ఘటన ప్రపంచాన్ని నివ్వెర పోయేలా చేసింది. నవంబ రు 5న అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో గెలుపు కోసం.. తీవ్రంగా చెమటోడు స్తున్న మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నాయకుడు డోనాల్డ్ ట్రంప్ పైనే దుండగుడు హత్యాయత్నం చేశాడు. పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్న సమయంలో దూసుకువచ్చిన ఆగంతకుడు.. ట్రంప్ లక్ష్యంగా కాల్పులు జరిపాడు. అయితే.. తృటిలో ఆయన ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇది పక్కన పెడితే.. ఎన్నికల్లో ఈ అంశం.. ఇప్పుడు సింపతీ రాజకీయాలకు దారితీయనుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాజకీయాల్లో ఇది సహజం కూడా. ఏపీలో సాధారణ ఎన్నికల సమయంలో చిన్న రాయి తగిలిన ఘటనను అప్పటి సీఎం జగన్ తనకు అనుకూలంగా.. మలుచుకునే ప్రయత్నం చేశారన్న విమర్శలు వున్నాయి. అలాంటిది.. మాటల మాంత్రికుడు.. ఏం జరిగినా..తనకు అనుకూలంగా మలుచుకునే ట్రంప్ ఈ ఘటనను వదిలి పెడతారా? అంటే.. అస్సలు వదిలి పెట్టే సమస్యే లేదు. సో.. తనపై జరిగిన ఈ దాడిని ట్రంప్ సింపతీగా మలుచుకునే అవకాశం స్పష్టంగా ఉంది. ఇప్పటికే అధ్య క్ష రేసులో ఉన్న జో బైడెన్ విధానాలతోపాటు.. ఆయన ఆరోగ్య సమస్యలను, అలవాట్లను కూడా.. ట్రంప్ ఏకరువు పెడుతూ.. ఏవగించుకుంటూ.. బైడెన్‌కు వ్యతిరేకంగా ప్రచారం దంచి కొడుతున్నారు. బైడెన్ మతిమరుపు రోగి అంటూ.. వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారంలో ఉన్న డెమొక్రాట్లను కప్పలతో పోలుస్తున్నారు. నిలకడ లేని నాయకులు అంటూ.. తిట్టిపోస్తున్నారు. ఇలాంటి ట్రంప్ తనపై జరిగిన దాడిని సింపతీగా మార్చుకునేందుకు ప్రయత్నించకుండా అయితే ఉండరు. అంతేకాదు.. గతంలోనే తాను తుపాకీ సంస్కృతిని అరికట్టేందుకు చేసిన ప్రయత్నాలు కూడా తెరమీదికి తెస్తారు. అప్పట్లో డెమొక్రాట్లు తనకు అడ్డుపడ్డారని ఆయన ఏకేయడమూ ఖాయంగానే కనిపిస్తోంది. ఇది తుపాకీ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న మెజారిటీ అమెరికన్లను మచ్చిక చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. పైగా తనను చంపేందుకు కుట్ర చేస్తున్నారని.. రెండు మాసాల కిందటే ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం గమనార్హం. ఇప్పుడు మరోసారి.. ఆయన ఇదే సెంట్రిక్‌గా సింపతీని గెయిన్ చేసుకుని అధ్యక్ష రేసులో దూసుకుపోవడం ఖాయమని అంటున్నారు పరిశీలకులు.

# అమ్మ మాట అంగన్వాడి బాట

### పూర్వ ఉమ్మడి మండలంలోని గ్రామాలలో ర్యాలీ నిర్వహించిన అంగన్వాడి టీచర్



శామీర్ పేట, (గరుడ వార్త) : మూడేళ్ల లోపు చిన్నారులను ప్రభుత్వ అంగన్వాడీలలో చేర్పించాలని ఎంపీడీవో మమతాబాయి కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రం శామీర్ పేట లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని శామీర్ పేట ఎంపీడీవో మమతాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మూడేళ్ల పిల్లలను తల్లిదండ్రులు విధిగా అంగన్వాడీలలో చేర్పించాలని తెలిపారు. బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు ముందుకు వచ్చి తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చేత పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. తుర్కపల్లిలో అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఆదర్శ కమిటీ



చైర్ పర్సన్ ఇర్రి జ్యోతి, అంగన్వాడి టీచర్లు నిర్మల, శకుంతల, రమాదేవి, భవాని, పప్పీ, అనురాధ, విజయలక్ష్మి, సుజాత, జయ, లావణ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మమత, వినీత, పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు



శామీర్ పేట, (గరుడ వార్త): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట రిత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మునీందర్ హెచ్చరించారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లు నడిపే వాళ్లు సీట్ బెల్టులు ధరించాలని చెప్పారు. వాహనాల ధృవపత్రాలు ఉండాలని సూచించా రు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను, త్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులను గుర్తించి పలు సూచనలు చేశారు. మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇక నుంచి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారి పై ప్రత్యేక ద్రుష్టి పెట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. పాలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అమృత, సిబ్బంది రాజు, లావణ్య పాల్గొన్నారు.

# ప్రజా వారి దరఖాస్తులను వీలైనంత త్వరలో పరిష్కరించండి...

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

సోమవారం ప్రజావాణి మీటింగ్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియ తో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో (80) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లో చేరిన పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్ జులై 15 : పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, మహిపాల్ రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# కల నెరవేరిస్తేనే.. విద్యాప్రగతి

సంగారెడ్డి : విద్యతోనే ప్రగతి సాధ్యం.. పేదరిక నిర్మూలనకు ఎంతో దోహదపడుతుంది.. డిగ్రీ వరకు విద్యాభ్యాసానికి ప్రభుత్వపరంగా వసతులు ఉన్నా ఆపై చదువులకు ఇబ్బందులు తప్పడం లేదు.. ఎన్నికల సమయంలో విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పే నేతలు ఆ తర్వాత వదిలేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో విశ్వవిద్యాలయాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏళ్లుగా అలాగే ఉండిపోవడం గమనార్హం. ఈ సారైనా ఎన్నికయ్యే నాయకుడు ఈ దిశగా అడుగేసి పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఊతమివ్వాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సిద్దిపేట, సంగారెడ్డి, నర్సాపూర్, జహీరాబాద్ ప్రాంతాల్లో పీజీ కళాశాలలు కొనసాగుతున్నాయి. సిద్దిపేటలో స్వయం ప్రతిపత్తి గల డిగ్రీ, పీజీ కాలేజీ ఉంది. ఇక్కడ ఎంతో మంది నాయకులు చదవడం గమనార్హం. ఇక సిద్దిపేట ఐదు జిల్లాలకు అనుబంధంగా ఉంది. పొరుగున ఉన్న రాజన్న సిరిసిల్ల, జనగాం, మెదక్, కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడికొచ్చి చదువుకుంటున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఇతర ప్రైవేటు కళాశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యాభ్యాసం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జహీరాబాద్ విద్యాక్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. సంగారెడ్డికి నారాయణఖేడ్, అందోల్, జిన్నారం తదితర ప్రాంతా నుంచి విద్యార్థులు వచ్చి వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. శిక్షణ కేంద్రాలు సైతం పదుల సంఖ్యలో




కొనసాగుతున్నాయి. సుమారు 20 వేల మందికి పైగా పలు కోర్సులు చదువుతున్నారు. మెదక్ జిల్లాలో గతంలో ఉన్న పీజీ కళాశాలను రద్దు చేశారు. ఇక్కడ నర్సాపూర్‌లో మాత్రమే ఈ కళాశాల ఉంది. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండటంతో వందలాది మంది అక్కడికి వెళ్లి కోర్సులు అభ్యసిస్తున్నారు.

**ఐడీ కళాశాలగా..**

సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఘన చరిత్ర ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఐడీ కళాశాలగా కొనసాగింది. ఇప్పుడు జిల్లాల పునర్విభజన తర్వాత సంగారెడ్డి జిల్లా ఐడీ కళాశాలగా ఉంది. ఏకైక స్వయం ప్రతిపత్తి కళాశాల కూడా ఇదే. 3,200 మంది చదువుతున్నారు. కళాశాలను యూనివర్సిటీగా మార్చాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం అధ్యాపకుల కొరత, నిధులలేమితో పాట్లు తప్పడం లేదు. 10 పీజీ కోర్సులు ఉండగా 620 మంది చదువుతున్నారు.

**మినీ వర్సిటీ తలపించేలా..**

సిద్దిపేటలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మినీ వర్సిటీని తలపిస్తుంది. ఇక్కడ 5 వేల మంది వరకు చదువుకుంటున్నారు. దీన్ని విశ్వవిద్యాలయంగా మార్చాలన్న డిమాండ్ రెండు దశాబ్దాలుగా ఉంది. ఇక్కడ డిజిటల్ లైబ్రరీని సైతం ఏర్పాటుచేశారు. మరెక్కడా లేనివిధంగా మత్స్య శాస్త్రానికి సంబంధించి ప్రత్యేక కోర్సు సైతం అమలవుతోంది. పూర్వవిద్యార్థులు సైతం నడుంబిగించి కళాశాల అభివృద్ధికి ముందుకొచ్చారు. ప్రస్తుతం వివిధ స్థాయిల్లో రాణిస్తున్న రాజకీయ ప్రముఖులు.. ఇక్కడ పట్టా పొందిన వారే కావడం విశేషం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మాత్రమే ఒక్క పీజీ కళాశాల కొనసాగుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధి పీజీ కళాశాలకు 50 ఎకరాల భూమి కేటాయిస్తే విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామని సంబంధిత అధికారులు హామీ సైతం ఇచ్చారు. ఇక్కడ సరైన స్థలం లభ్యం కాక అది ప్రతిపాదనకే పరిమితమైంది. ఇక్కడి పీజీ కళాశాల ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. సరైన వసతులు లేక నానాపాట్లు పడుతున్నారు. రెండేళ్ల కిందట పదెకరాలు కేటాయించగా.. నిర్మాణ పనులు షురూ కాలేదు. మూడేళ్ల కిందట ఎమ్మెస్సీ (ఇనార్గనిక్ కెమిస్ట్రీ), ఎంసీజే కోర్సులను సైతం ఎత్తేశారు.

# విమానం ఎగరాలి.. ఇందూరు మురవాలి!

ఆర్మూర్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా.. ఇతర ప్రాంతాలతో పోల్చిచూస్తే ప్రజల జీవన ప్రమాణాల్లో ముందుంది. ఇక్కడి వారు వ్యవసాయం, విద్య, ఉద్యోగపరంగా అభివృద్ధి చెందారు. పాశ్చాత్య దేశాలతో సంబంధాలున్న వారు లక్షల్లో ఉన్నారు. ఇక ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల, నిజామాబాద్ గ్రామీణం, అర్బన్ నియోజకవర్గాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లని ఊరు లేదేమోనన్నట్టు ఉంటుంది. ఒక్క బాల్కొండ గ్రామం నుంచే సుమారు 2,200 మంది ఎడారి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. వీరందరి రాకపోకలకు విమానాశ్రయం అనేది ఒక సాధారణ అవసరంగా మారింది. అయితే జిల్లాలోని జక్రాన్‌పల్లిలో ఏర్పాటుచేస్తామన్న హామీ దశాబ్దకాలంగా మరుగున పడుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో దీన్ని సాధిస్తే స్థానికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ ప్రాంత పురోగాభివృద్ధికి దోహదపడుతుంది. జిల్లాలో విమానం ఎగిరే విషయమై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు స్పష్టమైన హామీ ఇవ్వాలి. గెలుపొందిన వారు కేంద్రంతో మాట్లాడి ప్రజల కలను నెరవేర్చాలి.

మూడు సార్లు భూపరీక్ష చేసి..హైదరాబాద్–ఆదిలాబాద్‌ను కలుపుతూ వెళ్లే జాతీయ రహదారి–44ను ఆనుకొని నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి శివారులో విమానాశ్రయం నిర్మించాలని గతంలో నిర్ణయించారు. ఇక్కడ 1600 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 1250 ఎకరాలిస్తే సరిపోతుందని ప్రతిపాదించారు. 510 ఎకరాలు మొదటి విడతలో, 740 ఎకరాలు రెండో విడతలో సేకరిస్తామని ప్రకటించారు. ఎక్కువగా అసైన్‌మెంట్ భూములే ఉండడంతో రైతులకు ప్రత్యామ్నాయం చూపి తీసుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు ఉంటుందంటే సాగుదారులు కూడా ముందుకొస్తారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక బృందాలతో మూడు సార్లు ఇక్కడ మట్టి నమూనాలు సేకరించింది. స్థానిక పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని నివేదిక కూడా ఇచ్చింది. ఆ తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.వరంగల్ మాదిరే..రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణ కోసం దశాబ్దం కిందటే ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా ఆదిలాబాద్, వరంగల్, పెద్దపల్లిలోని బసంత్‌నగర్, కొత్తగూడెం దగ్గర పాల్వంచ, మహబూబ్‌నగర్‌లోని దేవరకద్రతో పాటు నిజామాబాద్‌లోని జక్రాన్‌పల్లిలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో వరంగల్, నిజామాబాద్‌లు అత్యంత ప్రాధాన్యం గల కేంద్రాలుగా 2021 జూన్‌లో ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు. వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో స్థానికంగా విమానాశ్రయ ఏర్పాటుకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



# ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా

## నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఫొటో దిగాల్సిన అవసరం లేదు: పవన్ కల్యాణ్


మంగళగిరి: వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశాం. పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్రబాబును కూడా జైలులో పెట్టారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూ కుంభకోణాలు చేశారు. అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. అధికారం కోసం కాదు.. ప్రజల కోసం పోరాటం చేశాం. జనసేన తీసుకున్న మంత్రి పదవులు కూడా ప్రజలతో నిత్యం సంబంధం ఉన్నవి. మన పార్టీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలి. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎంత సాధించినా తగ్గి ఉండటం అవసరం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఇలాంటి మెజార్టీ రాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాతో అన్నారు. వైకాపా వాళ్లు మనకు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు. వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదు. అలాగని వాళ్లు చేసిన తప్పులు సహించేదిలేదు.. చట్టపరంగా చర్యలు ఉంటాయి" అని పవన్ తెలిపారు.

## 63వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలపై లెక్కలేవీ?: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గవ్వాడ డిపోలో ఇసుక నిల్వలకు లెక్కలు లేకపోవడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విస్మయం వ్యక్తం చేశారు. సోమవారం ప్రభుత్వ ఇసుక డిపోను ఆయన పరిశీలించారు. 63వేల మెట్రిక్ టన్నుల నిల్వలపై దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని గనులశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ ఇసుక నిల్వలు ఎవరు తెచ్చారో అధికారులు చెప్పలేకపోతున్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఆ తర్వాతే ఇసుక ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు.

## పవన్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారు



అమరావతి, జూలై 15: పార్టీని అంచెలంచెలుగా పెరిగేలా చేయడంలో పవన్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం నాడు.. పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులను అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. ముందుగా మంత్రి నాదెండ్లను సత్కరించారు. ప్రజా ప్రతినిధులకు శాలువా కప్పి, గిఫ్ట్ గా కూరగాయలు అందించి పవన్ సన్మానించారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను జనసేన ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఉన్నామని... మిత్రపక్షాలతో సమన్వయంతో వెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బంది.. మచ్చ రాకుండా అందరూ పని చేయాలని మంత్రి సూచించారు.

"పదవులు మనకొచ్చాయి.. కానీ మనం కోసం పని చేసిన జనసైనికులు, వీర మహిళలను మరువద్దు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ మీద, ప్రభుత్వం మీద దుష్ప్రచారం మొదలు పెడతారు.. తిప్పి కొట్టాలి. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. నిజాయితీగా పని చేయాలి. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో దోపిడీ చేసింది. త్వరలో క్రియాశీల సభ్యత్వాన్ని ప్రారంభించనున్నాం. గతంలో తక్కువ సంఖ్యలోనే క్రియాశీలక సభ్యులను చేర్పించాం. ఇప్పటి వరకు సుమారు కార్యకర్తలకు ఆర్థిక సాయం కింద రూ. 18 కోట్లు అందించాం" అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వంలో ప్రతి జనసైనికుడూ భాగస్వామే అని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రాలపై అవగాహన పెంచుకోవాలని.. ప్రజలకు వివరించాలన్నారు. ఇది మన ప్రభుత్వమని.. పార్టీకి.. పవన్‌కు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ టీం అంటే ఇదీ అని అందరూ గొప్పగా చెప్పుకునేలా పని చేయాలన్నారు.

గత ఎన్నికల్లో ప్రజలు సైలెంటుగా ఓటేశారని.. ఎన్నికల ముందు వరకు ఏ మాత్రం బయటపడని ప్రజలు.. ఎన్నికల్లో తామేంటో చూపించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## కొడాలి నాని సన్నిహితుడి పెట్రోల్ బంక్ సీజ్..





గుడివాడ: గుడివాడలో కల్తీ పెట్రోలు విక్రయిస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని సన్నిహితుడి పెట్రోలు బంక్‌ను అధికారులు సీజ్ చేశారు. బంటుమిల్లి రోడ్డులోని షా గులాబ్ పెట్రోల్ బంక్‌లో ఏకకాలంలో తూనికలు, కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ, హెచ్‌పీసీఎల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. 5 లీటర్ల కొలతతో 4 పర్యాయాలు అధికారులు పరీక్ష నిర్వహించారు. నాలుగు సార్లు కూడా కల్తీ చేస్తున్నట్టు స్పష్టమైంది. ఈ క్రమంలోనే కల్తీ బయటపడడంతో అధికారులు బంక్‌ను సీజ్ చేశారు. మల్లాయిపాలెం పరిధిలోని ముదినేపల్లి రోడ్డులో మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని సన్నిహితుడు షా కీర్తికుమార్ జీవావత్‌కు చెందిన షా గులాబ్‌చంద్ జీవావత్ అండ్ కో పెట్రోలు బంకు ఉంది. ఈ బంకులో కల్తీ పెట్రోలు విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం 50 మందికి పైగా బైక్‌లలో 75 లీటర్ల వేర పెట్రోలు కొట్టించుకున్నారు. అవన్నీ కొద్దిదూరం వెళ్లగానే ఆగిపోయాయి. తిరిగి స్టార్ట్ అవ్వలేదు. షాక్ అయిన వాహనదారులు పెట్రోల్4ను చెక్ దీంతో బైక్‌లను బంకు వద్దకు తీసుకొచ్చి సిబ్బంది ఎదుట పెట్రోలు ట్యాంకులను తెరచి చూపించారు. కంపెనీ ప్రతినిధి తమ తప్పేం లేదని, పెట్రోలుతో పాటు ఇథనాల్ కలవకపోవడంతో వాహనాలు ఆగిపోతున్నాయని, బైక్‌కు ఏ ఇబ్బందీ ఉండదని 75లీటర్లు పెట్రోలు అమ్మకాలు జరిగాయని, తిరిగి వచ్చిన వారందరికి పవర్ పెట్రోలును కొట్టించి పంపుతున్నట్లు తెలిపారు. మరికొందరు పాత ద్విచక్రవాహనదారులు వాహనం ఎందుకు ఆగిందో తెలియక మెకానిక్‌లను ఆశ్రయించారు. ట్యాంకు నుంచి పెట్రోలును తీసి కల్తీపెట్రోలు కారణంగానే ఆగిపోయాయని, నెలలో రెండోసారి వాహనాల ట్యాంకులను శుభ్రపరిచామని మెకానిక్‌లు చెబుతున్నారు.

## శ్రీవారి ఆలయంలో ఆణివారి ఆస్థానం.. ఆర్జిత సేవలు రద్దు



తిరుమల, జూలై 15: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో రేపు (మంగళవారం) ఆణివార ఆస్థానం పర్వదినాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా సర్వభూపాల వాహనంలో శ్రీదేవీ భూదేవీ సమేత మలయప్పస్వామిని బంగారువాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో తీసుకురానున్నారు. అలాగే ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు పుష్ప పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఆణివార ఆస్థానం నేపథ్యంలో రేపు శ్రీవారి ఆలయంలో అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. ఈరోజు సిఫార్సు లేఖల స్వీకరణను కూడా టీటీడీ రద్దు చేసింది.

**శ్రీవారి దర్శనానికి 18 గంటలు...** మరోవైపు తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల సంఖ్య పెరిగింది. స్వామివారి దర్శనం కోసం 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పట్టనుంది. అలాగే నిన్న (ఆదివారం) శ్రీవారిని 84,797 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం 29,497 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీవారికి హుండీ ద్వారా రూ. 3.98 కోట్ల ఆదాయం లభించింది.



# ఇకపై క్రికెట్ స్టేడియంలో పొగాకు యాడ్స్ బంద్..!


## 'ఇకపై క్రికెట్ స్టేడియంలో పొగాకు యాడ్స్ బంద్'.. బీసీసీఐని ఆదేశించనున్న కేంద్రం!

పొగాకు ప్రకటనకు సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ ఓ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పొగాకు వినియోగాన్ని ప్రోత్సహించేలా ఉండే ప్రకటనలను ఇకపై క్రికెట్ స్టేడియంలో ప్రదర్శించకూడదని బీసీసీఐకి ఆదేశాలు జారీ చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. పాన్ మసాలా, పొగాకు మిశ్రమం ఉన్న చూయింగ్ గమ్, గుట్కా, పొగ రహిత పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన యాడ్స్‌ను టోర్నీలు జరిగే సమయంలో మైదానంలో ప్రదర్శించవద్దని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది.

అంతేకాకుండా.. ఇకనుంచి ప్రజలను ఈ దురలవాటుకు బానిసను చేసేలా ప్రముఖ నటులు, మాజీ క్రికెటర్లు వీటిలో నటించకుండా ఆంక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని సూచించనుంది. ఈ యాడ్స్ ద్వారా పొగాకు ఉత్పత్తులను తీసుకునేందుకు ప్రజలను ప్రోత్సహించడమే అవుతుందన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఇది దేశ యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదని తెలుస్తోందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

**ఒక్క సిరీస్‌తోనే కెప్టెన్‌గా చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్ :** ఐసీఎమ్ఆర్, గ్లోబల్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యయనాల ప్రకారం.. పొగాకు ఉత్పత్తుల బ్రాండ్లకు చెందిన ప్రకటనల్లో 41.3శాతం యాడ్‌లను గతేడాది జరిగిన ప్రపంచకప్ టోర్నీ 17 మ్యాచ్‌ల్లో ప్రసారం చేశారు. 2016-17లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆరోగ్య మంత్రిత్వశాఖ సర్వే ప్రకారం.. ఏటా 1.35 మిలియన్ల మంది వివిధ రూపాల్లో పొగాకు తీసుకుంటున్నారని వెల్లడైంది. దీంతో ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించాయి. అయితే దీనిపై ఆరోగ్యశాఖ అధికారిక ప్రకటన చేయాల్సిఉంది.





# జగన్ నిర్ణయంపై సీరియస్..!

## వైఎస్ జగన్ నిర్ణయంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డి సీరియస్..!

ప్రకాశం, జులై 15: ఇప్పటికే ఘోర పరాజయంతో సతమతం అవుతున్న జగన్‌కు.. సొంత పార్టీ నేతల అసమ్మతి మరో తలనొప్పిగా మారింది. తాజాగా వైసీపీ అధ్యక్షుడిగా వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంపై ఫైర్ అయ్యారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి 'నాయకులకు మా జిల్లా ఏమైనా గొడ్డు పోయిందా?' అంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తికి కారణం.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమించడమే. గత ఎన్నికల్లో అభ్యర్థుల మార్పు పేరుతో అసలు తమకు సంబంధమే లేని నియోజకవర్గాలకు నాయకులను కేటాయించారు.


ఏళ్లుగా ఒక నియోజకవర్గాన్ని అంటిపెట్టుకున్న కీలక నేతలను ఇతర నియోజకవర్గాలకు షిఫ్ట్ చేయడంతో ఘోర పరాజయం పాలయ్యారు. ఈవిధంగానే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమించారు. ఈ నిర్ణయంపై తాజాగా మాజీ మంత్రి బాలినేని తీవ్రంగా స్పందించారు.

**నాయకులకు కొదవ లేదు..** జగన్ నిర్ణయంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రకాశం జిల్లాలో నాయకులకు కొదవ లేదన్నారు. నేతలకు జిల్లా ఏమీ గొడ్డు పోలేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష పదవిని జిల్లాకు సంబంధించిన వ్యక్తులకే ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని బాలినేని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చెవిరెడ్డికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన చేశారు. అంతేకాదు.. జిల్లా నేతలకే అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని కరాఖండిగా తేల్చి చెప్పారు.

## ఇసుక అక్రమ తవ్వకాలు.. గత నివేదికలపై అనుమానాలున్నాయ్: సుప్రీంకు తెలిపిన ఏపీ ప్రభుత్వం



దిల్లీ: ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అక్రమ తవ్వకాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. మరిన్ని వివరాలు కోర్టు ముందుంచేందుకు కొంత సమయం కోరింది. గతంలో అధికారులు దాఖలు చేసిన నివేదికలపై అనుమానాలున్నాయని పేర్కొంది. వాస్తవాలు దాఖలు చేయలేదంటూ మీడియాలోనూ కథనాలు వచ్చాయని గుర్తుచేసింది. నివేదికలన్నీ పునఃపరిశీలించి ఆధారాలతో వివరాలు సేకరిస్తామని తెలిపింది. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు చెప్పారు. మరోవైపు పూర్తిస్థాయి నివేదిక సమర్పణకు తమకూ సమయం కావాలని కేంద్రం కోరింది. 6 వారాల సమయం కావాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటికే తాము 7 జిల్లాల్లో తనిఖీలు జరిపి నివేదికను కోర్టు ముందుంచినట్లు చెప్పింది. మిగిలిన జిల్లాల్లోనూ తనిఖీలు జరిపేందుకు 6 వారాల సమయం కావాలని కోరింది. తమ ఆధారాలు పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ దండా నాగేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న జస్టిస్ అభయ్ ఎస్ వోకా ధర్మాసనం విచారణను ఆగస్టు 2కు వాయిదా వేసింది.



# వాడికి.. నాకూ సంబంధం లేదు..

## అప్పుడు జగన్ వద్దన్నారని ఆగా.. ఇప్పుడు ఎవ్వరి మాటా వినను..

విశాఖ: చాలా రోజుల తర్వాత వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మీడియా ముందుకు వచ్చారు. తనపై ఓ మహిళ గర్భం విషయంలో చాలా ఆరోపణలు వచ్చినా కూడా ఆయన స్పందించలేదు. ఇవాళ స్వయంగా ఆమె వచ్చి విజయసాయితో తనకు ఎలాంటి సంబంధమూ లేదని గట్టిగా చెప్పారు. ఆ తరువాత కొంత సేపటికే ఆయన మీడియా ముందుకు వచ్చారు. తన పేరు ప్రతిష్టలు దెబ్బ తీసిన వారెవరైనా.. ఆఖరికి మా పార్టీలో ఉన్న వారైనా వదేలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇంకా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను సొంతంగా చానల్ పెడతానని అన్నానని.. అప్పుడు మనకొక ఛానల్ ఉంది కదా వద్దని తమ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి వారించారన్నారు. దీంతో తాను విరమించుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ సారి మాత్రం తగ్గేదే లేదని.. ఛానెల్ తప్పకుండా ప్రారంభిస్తానని.. ఎవరి వద్దని వారించినా స్టార్ట్ చేస్తానని స్పష్టం చేశారు. తను పెట్టే ఛానల్ న్యూట్రల్‌గా ఉంటుందని.. నిజాలు మాత్రమే చెబుతానని విజయసాయి రెడ్డి అన్నారు. 2029 ఎన్నికల్లో వైసీపీదే విజయమన్నారు. తాను భూములు అక్రమిస్తే.. వాటిని తిరిగి తీసుకోవాలని.. తనకేమీ అభ్యంతరం లేదన్నారు. స్కాలర్షిప్ విషయంలో మదన్ మోహన్ తనను రెండు సార్లు కలిశారన్నారు. వాడికి.. తనకూ ఏ మాత్రం సంబంధం లేదని విజయ సాయిరెడ్డి స్పష్టం చేశారు.

# ఆక్రమణల దరువు.. గుండె చెరువు

సిరిసిల్ల: జలవనరులను ఆక్రమణదారులు మింగేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు.. మట్టితో చదునుచేస్తున్నారు. ఎప్పుడో మొదలైన ఆక్రమణలు.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. చెరువులు, కుంటల ఆక్రమణలతో కబ్జాదారుల పంట పండుతోంది. సమీపంలోని వ్యవసాయ, బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. శిఖం, మత్తడి ప్రవాహ మార్గాల కబ్జాలతో వరదనీరు వెళ్లడం లేదు. పట్టణాల్లోని కాలనీలకు ప్రవాహం చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల ముంపుతో రైతులు నష్టపోతున్నారు. నిలువరించాల్సిన అధికారులు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా చెరువుల ఆక్రమణలు ఇదేమాదిరి కొనసాగుతున్నాయి. చాలారోజులుగా ఇలాంటి పరిస్థితే ఉందని అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణలను మాత్రం



పట్టించుకోవడంలేదు. సిరిసిల్ల పట్టణంలో 17, వేములవాడ పట్టణం, గ్రామీణ మండలాల చుట్టుపక్కన 8 చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. కొన్నిచోట్ల చెరువుల్లో మట్టినింపి ఏకంగా ప్లాట్లుగా చేసి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే.. గ్రామాల్లో పంట పొలాలను సాగుచేస్తూ.. భూమిని చదునుచేసుకుంటూ శిఖంలోకి వస్తున్నారు. దీంతో చెరువులు, కుంటల్లో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఫలితంగా ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. మిషన్‌కాకతీయలో చెరువుల అభివృద్ధికి ముందు అప్పటి ప్రభుత్వం ప్రతి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించింది. ప్రతి చెరువుకు జియో ఐడీలను నమోదు చేసి వాటి విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను నమోదు చేశారు. తర్వాత వీటి నిర్వహణ సక్రమంగా చేపట్టలేదు. ఆక్రమణలు పెరిగి చెరువుల్లో నిర్మాణాలు వెలుస్తుండటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఏడాదిన్నర క్రితం చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో సరైన విధివిధానాలు, అవసరమయ్యే నిధుల కేటాయింపులో స్పష్టతలేకపోవడంతో అవి బుట్టదాఖలయ్యాయి. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, సర్వేలాండ్ రికార్డులశాఖ మధ్య సమన్వయంలేక ఎవరూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు ఇష్టారాజ్యంగా నీటి వనరులను ఆక్రమించుకుంటున్నారు.

కోనరావుపేట మండలం వట్టిమల్లలోని రాయినిచెరువు విస్తీర్ణం 50 ఎకరాలు. శిఖం ఆక్రమణలతో ప్రస్తుతం 15 ఎకరాలకు చేరింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితో ఈ చెరువు నిండుతుంది. దీనికింద 200 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందడంతోపాటు చుట్టూ ఉన్న తండాల్లో భూగర్భజలాల వృద్ధికి ఉపయోగపడుతుంది. ఆక్రమణలకు గురైన చెరువును పరిరక్షిస్తే మెట్టప్రాంతంలో సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయి.

సిరిసిల్ల పట్టణంలోని ఈదుల చెరువు విస్తీర్ణం 160 ఎకరాలు. నిర్మాణ వ్యర్థాలు.. కొందరు ఆక్రమణదారులు మట్టితో చదును చేస్తూ ఆక్రమించేస్తూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ కారణంగా ప్రస్తుతం 70 ఎకరాలు కూడా విస్తీర్ణం లేని పరిస్థితి. ఇందులోకి వచ్చే వరదనీటి కాల్వ సైతం నామరూపాల్లేకుండా పోయింది. పట్టణంలో 18 చెరువుల పరిస్థితి ఇలాగే ఉంది. ఈ కారణంగా చిన్నపాటి వర్షాలకే కాలనీల్లోకి వరద నీరు ముంచెత్తుతోంది.

అధికారులు ఏమంటున్నారంటే..సిరిసిల్ల పట్టణంలోని ఈదుల చెరువులో అక్రమ నిర్మాణాలను గుర్తించాం. వాటికి అనుమతులు ఇవ్వడం లేదని పట్టణ ప్రణాళికాధికారి అన్సారీ తెలిపారు. చెరువుల్లో జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయా లని మా సిబ్బంది వెళితే అక్కడివారంతా ఏకమై సిబ్బందిపైకి గొడవకు వచ్చారు. చెరువులు, కుంటల ఆక్రమణలను ఇప్పటికే గుర్తించామని డీఈ క్రాంతి పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వేఅధికారులు సంయుక్తంగా కలిసివస్తేనే చెరువులకు హద్దులు నిర్ణయించడం సాధ్యమవుతు ందన్నారు.

వనరులను కాపాడితేనే మనుగడ

నరేష్, వట్టిమల్ల, కోనరావుపేట మండలం

చెరువును పూడ్చివేయకుండా అధికారులే చొరవ తీసుకోవాలి. నీటి వనరులను రక్షిస్తే మాకు ఏడాదికి రెండు పంటలకు సాగునీరు అందుతుంది. గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండి తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఆక్రమణలు ఇలాగే కొనసాగితే చెరువులు రూపు కోల్పోయి నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గుతుంది. సాగు భూములు బీడుగా మారతాయి. చెరువును కాపాడాలని రెండేళ్లుగా జిల్లా అధికారులను కలిసి వినతి పత్రాలు ఇస్తున్నా స్పందనలేదు.

# కరుణించిన గోదారి

హైదరాబాద్: నగరానికి తాగునీటిని అందించే జలాశయాలు అడుగంటుతున్న నేపథ్యంలో పెద్ద ఊరట దక్కింది. గోదావరి పరివాహక ప్రాంతంలో వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. గురువారం ఒక్కరోజే 0.109 టీఎంసీల దాకా వచ్చింది. ఈ నీళ్లు వచ్చే 93 రోజులు నగరానికి తరలించడానికి సరిపోతాయని అధికారులు తెలిపారు. మహా నగరానికి అవసరమైన తాగునీటిని నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, జంట జలాశయాలు, సింగూరు, మంజీరాల నుంచి నిత్యం తరలిస్తున్న సంగతి తెలిసిందే. గతేదాది తగినంత వర్షాలు లేక ఈ ఏడాది మార్చినాటికి జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతూ వచ్చాయి. కీలకమైన నాగార్జునసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో ఆందోళనకర స్థాయికి మట్టాలు తగ్గడంతో జలమండలి అత్యవసర పంపింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి అత్యవసర పంపింగ్‌తో నిత్యం 270 మిలియన్ గ్యాలన్లు తరలిస్తున్నారు. ఎల్లంపల్లిలో ఇటీవలి వరకు అత్యవసర పంపింగ్‌తో 172 ఎంజీడీలు తరలించారు. తాజాగా ఎల్లంపల్లికి వరద రావడంతో... జలాశయంలో ఏర్పాటుచేసిన పంపులు, మోటార్లను తొలగించి ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం పంపింగ్ లేకుండానే అప్రోచ్ ఛానల్‌లోకి వరద నీరు చేరుతోందని అధికారులు తెలిపారు. వానలు కురుస్తుండటంతో ముమ్ముందు వరద పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్‌లో మాత్రం మరికొన్నాళ్లు అత్యవసర పంపింగ్ ఉంటుందన్నారు.

# మత్తు వదిలితేనే భవిష్యత్తు



మేడిపల్లి: గంజాయి మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని ముఖ్యమంత్రి పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో పోలీసులు గంజాయి నిర్మూలనకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ నిందితులు వివిధ మార్గాల్లో గంజాయి తదితరాలను రవాణా, విక్రయిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు సందర్భాల్లో నిందితులను అరెస్టు చేస్తున్నా గంజాయి ప్రభావం తగ్గడం లేదు. అధికారులతోపాటు కుటుంబసభ్యులు, స్వచ్ఛంద సంస్థలు వ్యసనపరులను త్వరగా గుర్తించి బయట పడేస్తేనే వారు జీవితంలో రాణిస్తారు. లేదంటే వారు మత్తులో జోగుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటారు.

గోదావరిఖనికి చెందిన ఓ యువకుడు దుకాణంలో పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. స్నేహితుల వల్ల అతనికి గంజాయి అలవాటైంది. కొద్ది రోజులకే ఆ మత్తు లేకుండా ఉండలేని పరిస్థితికి చేరుకున్నాడు. పనిపై ఆసక్తి తగ్గింది. ఆరోగ్యం పాడయింది. చివరికి అనారోగ్యంతో చిన్న వయసులోనే మృతి చెందాడు.

కరీంనగర్‌కు చెందిన యువతికి హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో వివాహం జరిగింది. ఎన్నో ఆశలతో అత్తగారింట్లో అడుగుపెట్టిన యువతికి కొన్నాళ్లకే భర్త గంజాయికి అలవాటుపడినట్లు గుర్తించి మానసికంగా కుంగిపోయింది. కొద్ది రోజులకు డ్రగ్స్ కూడా తీసుకోవడం.. వికృతంగా ప్రవర్తిస్తుండటంతో పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించి భర్తతో విడాకులు ఇప్పించారు. పచ్చని సంసారంలో గంజాయి నిప్పులు పోసింది.

నాందేడ్ నుంచి..

కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల ప్రాంతాలకు నాందేడ్ నుంచి గంజాయి రవాణా అవుతోంది. మహారాష్ట్రలో చాలా మంది గంజాయి సాగు చేస్తుండగా ఇటీవల మెట్‌పల్లిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నాందేడ్‌లోని ఓ మురికివాడలో అమ్ముతున్న గంజాయిని పొట్లాలుగా చేసి రైలు, బస్సు మార్గాల్లో జగిత్యాల జిల్లాకు తరలించి విక్రయిస్తున్నారని తేలింది. గంజాయి కేసులో జులై 8న ముగ్గురిని, జులై 9న ఇద్దరిని అరెస్టు చేశారు. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ కన్నాల టోల్‌ప్లాజా సమీపంలో జులై 7న ఇద్దరిని అరెస్టు చేయగా మహారాష్ట్ర నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు.

ఒడిశా..ఒడిశా నుంచి హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి రవాణా జరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ పరిధిలో పోలీసులు జులై 2న 14.59 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ప్రశ్నిస్తే ఒడిశా నుంచి గంజాయి తరలించినట్లు ఒప్పుకొన్నాడు.

ఏపీ..

రాజమండ్రి నుంచి దిల్లీ రైలులో గంజాయి తరలిస్తుండగా పెద్దపల్లి పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చిలో జగిత్యాలలో సంచలనం రేపిన మైనర్ల గంజాయి కేసులో పోలీసులు అయిదుగురిని అరెస్టు చేయగా ఏపీలోని సీలేరు నుంచి తరలించినట్లు తెలిపారు. మే 31న కరీంనగర్‌లో కారులో 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం నుంచి గంజాయి తెస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు.

జీవితాన్ని చిత్తు చేస్తుంది ఇలా..

గంజాయి నేరుగా మనిషి మెదడుపై ప్రభావం చూపించడం ప్రారంభిస్తుంది. కళ్లు ఎర్రగా, మత్తుగా కనిపిస్తాయి. విపరీతంగా ప్రవర్తిస్తారు.

కోపం, చిరాకు పెరుగుతుంది.

తల్లిదండ్రులకు ఎదురు మాట్లాడుతుంటారు. గట్టిగా హెచ్చరిస్తే దాడులకు కూడా తెగబడుతుంటారు.

వినియోగం పెరిగిన కొద్దీ వారి ప్రవర్తన తీరు కూడా అలాగే మారుతూ వెళ్తుంది.

చివరికి జీర్ణ వ్యవస్థపైనా ప్రభావం చూపి ఆకలి వేయదు.

ఆహారం సరిగా తీసుకోకపోవడంతో శారీరకంగా బలహీనమై ఆరోగ్యం దెబ్బతింటుంది.

బలవుతున్న బాల్యం

ఉమ్మడి జిల్లాలో గంజాయి మత్తుకు కొందరు బాలలు కూడా బలవుతున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో జులై 6న రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు పోలీసుల తనిఖీలు చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిలో ఇద్దరిని పోలీసులు పట్టుకోగా ఇద్దరూ మైనర్లే కావడం.. వారి వద్ద 750 గ్రాముల గంజాయి దొరకడంతో విస్తుపోయారు. నాందేడ్‌లో విక్రేత ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లిన పోలీసులకు బాలుడే నిందితుడు కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. ముగ్గురినీ జువైనల్ హోంకు తరలించారు. జగిత్యాలలో సంచలనం రేపిన గంజాయి కేసులోనూ బాలికలకు గంజాయి సరఫరా చేసిన వారిలో మైనర్లు ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అవాక్కయ్యారు. బాలబాలికలకు చాక్లెట్ల రూపంలోనూ విక్రయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో గంజాయి అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. చాలా సందర్భాల్లో అమ్మేవారు, కొనుగోలు చేసేవారు మైనర్లే కావడం గంజాయి తీవ్రతను తెలియజేస్తోంది.

కోలుకునేందుకు మూడేళ్లు

డాక్టర్ రాము, హెల్పింగ్‌హాండ్స్ డీఅడిక్షన్ సెంటర్, హన్మకొండ

గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలు యువకులు, మైనర్ల శరీరం, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. విపరీత మానసిక ప్రభావంతో కోపం, చిరాకు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు పూర్తిగా కోలుకునేందుకు మూడేళ్లు పడుతుంది. డీఅడిక్షన్ కేంద్రంలోకి డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు వస్తే మూడు నెలల్లో వివిధ స్థాయిల్లో మందులు, కౌన్సెలింగ్ ఇస్తాం. యువకులు, స్వచ్ఛంద సంస్థల వారు కలసి ముందుకు కదిలితేనే డ్రగ్స్ మహమ్మారిని తరిమేయవచ్చు.

పటిష్ఠ నిఘాఅశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకాలపై నిఘా పెంచాం. అమ్మినవారు, కొనుగోలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా సరిహద్దులతో పాటు అన్ని ప్రాంతాల్లో మా సిబ్బంది సోదా చేస్తున్నారు. యువకులు, మైనర్లు సహా ఎవరూ డ్రగ్స్ బారిన పడకుండా కుటుంబసభ్యులు జాగ్రత్త వహించాలి. గంజాయి అమ్మకాలపై సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారమిస్తే నిందితులపై చర్యలు తీసుకుంటాం.

# అంత మా ఇష్టం

కరీంనగర్ : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు ఉద్యోగులు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేలా, సకాలంలో సేవలందేలా, సర్కారు కార్యక్రమాలు సరిగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన చాలామంది ఉద్యోగులు వేళాపాలా లేకుండా కార్యాలయాలకు వస్తున్నారు. బయోమెట్రిక్ యంత్రాలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించింది. కొందరు ఉద్యోగులు సమయానికి రాగా, చాలామంది ఆలస్యంగా వచ్చారు. పలుచోట్ల ప్రజలు అధికారుల కోసం ఎదురుచూడడం కనిపించింది.

నింపాదిగా వచ్చి...జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో ఇక్కడికి రాకుండానే పాఠశాలల పర్యవేక్షణకు వెళ్లారు. ఒక సూపరింటెండెంట్ సెలవులో ఉన్నారు. మరొకరు సమయానికి వచ్చారు. సమగ్ర శిక్షా విభాగంలోని సెక్టోరల్ అధికారుల్లో కోఆర్డినేటర్-4 ఉదయం 10.45, కంప్యూటర్ ఆపరేటర్ 11 గంటలకు వచ్చారు. పరీక్షల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ మినహా మిగిలిన వారు 11 గంటల వరకూ రాలేదు. జిల్లా విద్యాశాఖ సీనియర్ అసిస్టెంట్లలో స్కూల్ అసిస్టెంట్ సెక్షన్ ఉద్యోగి 10.45కు, ఎస్టాబ్లిష్, ఆర్‌టీఐ సెక్షన్ ఉద్యోగి 11 గంటల తర్వాత వచ్చారు. కార్యాలయంలో లేట్ రిజిస్టర్ కనిపించలేదు.

ఉదయం ఠంచన్‌గా.. మధ్యాహ్నం డీలా

కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి కావడంతో ఉద్యోగులు ఠంఛన్‌గా వచ్చారు. కమిషనర్ ఉదయం 10.58 గంటలకు రాగా, డిప్యూటీ కమిషనర్ కలెక్టరేట్ సమావేశానికి వెళ్లారు. 10.30 గంటల నుంచే ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనకు ప్రజలుబారులు తీరగా, కంప్యూటర్ ఆపరేటర్లు సేవలందించారు. అవుట్‌డోర్ స్టాఫ్ మధ్యాహ్నం మూడు గంటలకు నగర పాలికకు రావాల్సి ఉండగా ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీర్లు సాయంత్రం 4.50 గంటల వరకూ హాజరుకాలేదు.

కార్పొరేషన్‌సమయానికి ఒకరే ..కరీంనగర్ రూరల్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్ (ఈఆర్వో) కార్యాలయంలో జూనియ ర్ అకౌంట్స్ అధికారి మాత్రమే సమయానికి వచ్చారు. మిగిలిన 12 మంది పది నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఏఏవో మాత్రం బిల్లుల వసూలును పర్యవేక్షించడానికి వెళ్లినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఈఆర్‌వో కార్యాలయంలో తొమ్మిది మందికిగాను ముగ్గురు విధులకు సకాలంలో హాజరుకాలేదు.

మధ్యాహ్నం వరకు తాపీగా..

మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా అగ్రికల్చర్ టెక్నికల్ కార్యాలయ సిబ్బంది కుర్చీలుజిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ఉద్యోగులు మధ్యాహ్నం వరకు వస్తూ..నే ఉన్నారు. జిల్లా అధికారి ఉదయం పదకొండు గంటలకు వచ్చారు. ముగ్గురు 10.30 గంటలకు మరో ఆరుగురు 10.45 వరకు విధులకు హాజరై సంతకం చేశారు. ఏడీఏ పదకొండు గంటలకు, మరో ముగ్గురు 12 గంటలకు తాపీగా వచ్చారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మధ్నాహ్నం వరకు హాజరు కాని వారితో క్యాజువల్ లీవ్ పెట్టిస్తానని తెలిపారు.

వాహనదారుల ఎదురుచూపులు

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉద్యోగులతోపాటు ఏవో, అటెండర్లు, ఇతర సిబ్బంది ఉదయం పది గంటలకే విధుల్లో ఉన్నారు. హోంగార్డులు, కానిస్టేబుళ్లలో కొందరు పది గంటలకు, మరికొందరు అరగంట తర్వాత వచ్చారు. ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు 10.40 గంటల తర్వాత వచ్చారు. అప్పటి వరకు లెర్నింగ్, డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వాహనదారులు ఎదురు చూడాల్సి వచ్చింది.కలెక్టరేట్‌లో 11 గంటల తర్వాతే..

పరిపాలన విభాగంలో..

కలెక్టరేట్ పరిపాలన విభాగంలో సగానికి పైగా సిబ్బంది 10.30 గంటలకు హాజరుకాలేదు. ఎన్నికల విభాగంలో 10 మంది సిబ్బంది పని చేస్తుండగా.. ఇద్దరు మాత్రమే సమయానికి వచ్చారు. సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయంలో ఉన్న సిబ్బందిలో ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఏడీ ఎప్పుడొస్తారని అటెండర్‌ను అడిగితే.. క్యాంపు వెళ్లారని సమాధానం ఇచ్చారు. ట్రెజరీ కార్యాలయంలో సెక్షన్ ఇన్‌ఛార్జి మినహా.. మిగిలిన సిబ్బంది కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

రోగుల నిరీక్షణ ఈఎన్‌టీ వైద్యులు రాకపోవడంతో రోగుల ఎదురుచూపులు..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా వైద్యులు విధులకు రాలేదు. కొందరు ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు ఉదయం తొమ్మిది గంటలకు రావాల్సి ఉండగా 9.48 గంటల వరకూ ఓపీ గదులు మూసే ఉన్నాయి. కొందరు రెగ్యులర్ వైద్యులు రాకపోవడంతో పీజీలు, ఎస్‌ఆర్‌లు చికిత్స అందించారు. ఐసీయూలో కూడా ఎస్‌ఆర్ చికిత్స అందించడం విశేషం. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డిని వివరణ కోరగా విధులకు ఆలస్యంగా వస్తున్న వైద్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యుత్తు వినియోగదారుల ఇబ్బందులు

విద్యుత్తు సంస్థ ఈఆర్‌వో కార్యాలయం ఆవరణలో ప్రైవేటు విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రంలో మూడు కౌంటర్లు ఉన్నాయి. ఇద్దరు బిల్ కలెక్టర్లు సమయానికి రాగా, ఒకరు 9.48 గంటలకు వచ్చారు. అప్పటి వరకు వినియోగదారులు ఇబ్బందిపడ్డారు.పంచాయతీలు విలవిల.. నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

జగిత్యాల గ్రామీణం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధుల విడుదలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలలో నిధులు లేక కార్మికుల, ఆపరేటర్ల వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో మొత్తం 380 గ్రామ పంచాయతీలు ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో 9 లక్షలకుపైగా జనాభా ఉంది. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు పుష్కలంగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీలు, ఆదాయం లేని పంచాయతీలకు నిధుల కొరత ఏర్పడింది. 2023-24 సంవత్సరానికి రూ.59.45 కోట్లు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల కాగా రాష్ట్ర ప్రభుత్వం అందించే గ్రాంట్ కేవలం రూ.3.64 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. గతేడాది నవంబర్ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు 2022 నుంచి నిలిచిపోయాయి. 2019 సెప్టెంబర్‌లో గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తే రాష్ట్ర ప్రభుత్వ అంతే మొత్తం నిధులు కలిపి ప్రతి నెలా ఇచ్చేది. జిల్లాకు ప్రతి నెలా రూ.6.50 కోట్ల నుంచి రూ.7.50 కోట్ల వరకు నిధులు వచ్చేవి. వచ్చిన నిధులతో పారిశుద్ధ్యం, వేతనాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వారు. కొద్ది నెలలు సరిగా వచ్చినా ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు పూర్తిగా నిలిపేయగా కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘ నిధులు మాత్రమే విడుదల చేస్తున్నారు. 8 నెలలుగా నిధులు రాకపోవటంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. సిబ్బందికి వేతనాలు లేవు గ్రామాల్లో 2023-2024 సంవత్సరానికి పన్నులు దాదాపు వసూలు చేసి ఖర్చు చేశారు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోటంతో 380 గ్రామ పంచాయతీల కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. డాటా ఎంట్రీ ఆపరేటర్లు 70 మంది వరకు ఉండగా వారికి సైతం రెండు నెలలుగా వేతనాలు రాక అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీలు చెల్లించే వీధి దీపాల బిల్లు రూ.16.88 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉంది. జిల్లాలో పల్లె ప్రగతి కార్యక్రమంలో 251 ట్రాక్టర్లను రుణం రూపంలో తీసుకున్నారు. ఇందులో కొన్ని ట్రాక్టర్ల ఈఎంఐలు పూర్తికాగా ఇంకా దాదాపు 111 వరకు ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు లేక చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం అందజేసే గ్రాంట్, కేంద్ర ప్రభుత్వం అందజేసే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

# ఉద్యోగ విరమణలే.. భర్తీ శూన్యం

భువనగిరి : మహిళా శిశు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్)లో భాగంగా జిల్లాలో 1982 నుంచి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో టీచర్లు, హెల్పర్లు(ఆయాలు) సేవలు అందిస్తున్నారు. ఉద్యోగ విరమణ వయస్సును నిర్ణయించకపోవడంతో నియామకం నాటి నుంచి వారే విధుల్లో కొనసాగుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని తొలగించడం, ఎవరైనా మరణించడం, స్వచ్ఛందంగా తప్పుకోవడం తప్ప విరమణకు ప్రభుత్వం వయస్సు నిర్ధారించలేదు. జీవో నెంబర్ 10, తేదీ 5.9.2023 ప్రకారం ప్రతిఏటా ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు( ఆయాలకు) ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంటుందంటూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్లు నిండిన వారిని విధుల నుంచి తప్పించాలని తాజాగా గత జూన్ నెల 29న మెమో నెం. 1334ను జారీ చేసింది. జులై నాలుగో తేదీ నుంచి వారిని విధుల్లో రావొద్దని సీడీపీవోలు ఆదేశించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 టీచర్లు, 102 మంది ఆయాలు(హెల్పర్లు) ఉద్యోగ విరమణ పొందారు.

ఆయాల వయస్సుతో పేచీ..

65 ఏళ్లు నిండిన వారిని తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. ఆయాల వయస్సు నిర్ధారణలో పేచీ నెలకొంది. టీచర్ల వయస్సు 10వ తరగతి సర్టిఫికెట్ ఆధారంగా నిర్ధారిస్తున్నా.. ఆయాల విషయంలోనే వివాదం కొనసాగుతోంది. ఆధార్‌లో వయస్సు తప్పుగా పడిందని, తమకు 65 ఏళ్లు నిండలేదని సర్వీస్‌లో కొనసాగించాలని కోరుతున్నారు. జిల్లాలో 13 మంది కొనసాగించాలని కోరుతున్నారు. 2024-25 ఎన్‌హెచ్‌టీఎస్-ఈఎంఎస్ (ఎంప్లాయిస్ మేనేజ్ సిస్టం) ప్రకారం 65 ఏళ్లు నిండితే ఉద్యోగ విరమణ చేయించాలని, తేడా ఉంటే ఆధార్, లేదా జిల్లా మెడికల్ బోర్డు సర్టిఫికెట్, ఎముకల డెన్సిటీ నిర్ధారణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా వయస్సు నిర్ధారించాలని ఆదేశించారు. ఎముకల డెన్సిటీ నిర్ధారణ సర్టిఫికెట్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉంది.


ఒక్కసారిగా ఉద్యోగ విరమణ జరగడంతో ఆయా కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. ఇంతకు ముందే జిల్లాలో సుమారుగా వందకుపైగా పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. ఖాళీలు ఏర్పడిన చోట పక్క కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు అప్పగించి వాటిని నడిపిస్తున్నారు. కొన్నింటిలో ఆయాలతో, మరికొన్నింటిలో టీచర్లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 టీచర్ పోస్టులు, 233 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

సేవలు కొనసాగేలా చర్యలు - కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లాఅంగన్‌వాడీ సిబ్బంది ఉద్యోగ విరమణతో ఖాళీలు ఏర్పడిన కేంద్రాల నిర్వహణకు ఇబ్బంది ఏమీ లేదు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. పక్క కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఆయా, టీచర్లలో సేవల్లో ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# కులాంతర వివాహం.. అందని ప్రోత్సాహకం

సూర్యాపేట :చివ్వెంల మండలంలో ఎస్సీ కులానికి చెందిన శ్రీకాంత్, అదే గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన మమతను... పెద్దలను ఒప్పించి 2023 అక్టోబరులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ మరుసటి నెలలో ప్రభుత్వం అందించే కులాంతర వివాహ ప్రోత్సాహకానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఏడు నెలలు గడిచినా నేటికీ అది అందలేదు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని చెబుతున్నారని తెలిపాడు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం కల్యాణలక్ష్మి తరహాలో నగదు అందిస్తోంది. ప్రస్తుతం సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా చాలా వరకు కులాంతర వివాహం చేసుకుంటున్నారు. వారికి ఆర్థికంగా బాసటగా నిలవాలనే ఉద్దేశంతో వివాహం చేసుకున్న ఆ జంటకు ప్రోత్సాహకం అందిస్తున్నారు. 2011 వరకు ఇది రూ.10 వేలు ఉండగా.. 2012లో రూ.50 వేలకు పెరిగింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దీనిని రూ.2.50 లక్షల వరకు పెంచి అందిస్తున్నారు. ఆశయం బాగున్నా.. నిధుల లేమి కారణంగా గత ఏడాది నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

అంతరాలు దూరం చేయాలని...కులాంతర వివాహం చేసుకున్న వారికి సమాజం నుంచి సహకారం అందదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తు తుంటాయి. ఈ నేపథ్యంలో వారికి రూ.2.50 లక్షల ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తోంది. ఈ మొత్తాన్ని దంపతుల సంయుక్త ఖాతాలో మూడేళ్ల పిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారు. ఇందుకు దంపతులు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులను అందించాల్సి ఉంది. దంపతుల్లో ఒకరు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలి. వివాహ



చట్టం - 1955 కింద నమోదై ఉండాలి. మొదటి పెళ్లికి మాత్రమే ఇది వర్తిస్తుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

667 మంది ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లాలో కులాంతర వివాహాలకు సంబంధించి ఇప్పటి వరకు సుమారు 667 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రూ.16.67 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రావడం లేదు. దీంతో లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు.అప్పుడప్పుడు వచ్చే అరకొర నిధులను వరుస క్రమంలో పది మందికి చొప్పున అందిస్తున్నారు. ఏడాదికి మూడు సార్లు పది మందికి చొప్పున మంజూరు కావడంతో చాలా మంది అర్హులు ఎదురు చూస్తున్నారు. పైగా చాలా మందికి ఆర్థిక సాయంపై అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోవడం లేదు.అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే అర్హులందరు సాయం పొందే అవకాశం ఉంది.

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది : లత, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, సూర్యాపేట

కులాంతర వివాహాలకు సంబంధించి ప్రోత్సాహకం మంజూరు కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఒకేసారి విడుదల కావడం లేదు. నిధులు సరిపోను రాకపోవడంతో కొంత మందికి అందిస్తున్నాం. బకాయిల విషయమై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

# సాగు నీటికి దారేదీ..!

మేడిపల్లి: అసలే వర్షాలు పడక అన్నదాతలు ఆందోళన చెందుతుంటే సాగునీటి కాలువల దుస్థితి వారి ఆశలను మరింత నీరుగారుస్తోంది. కాలువల నిర్వహణ అధ్వానంగా ఉండగా నీరు ఎలా పారుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తాచెదారం ఒకచోట చేరి నీరు ముందుకు సాగని దుస్థితి నెలకొంది. ఒకవేళ నీటిని విడుదల చేస్తే తమ వ్యవసాయ క్షేత్రాలకు చేరుకుంటాయా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువ దుస్థితిపై పరిశీలన కథనం.

కాలువను కప్పేశాయి

బుగ్గారం మండలం చిన్నాపూర్, వెల్గొండల గ్రామాల మధ్య ఉన్న ఎస్సారెస్పీ కాలువ అధ్వానంగా ఉంది. ఈత చెట్లు, పెద్ద పెద్ద వృక్షాలు కాలువను పూర్తిగా కప్పేశాయి. చెట్ల పొదలు దట్టంగా పెరిగి సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

బుగ్గారం నిర్వహణ లేక నిరుపయోగం

డీ–53 కాలువ ద్వారా వెల్గటూరు, కుమ్మరిపల్లి, స్తంభంపల్లి, పాశిగామ, కోటిలింగాల తదితర గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలకు నీరందించాల్సి ఉంది. కాలువల నిర్వహణ అస్తవ్యస్థంగా ఉండటం.. చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో ఇప్పటివరకు నీరు వచ్చిన దాఖలాలు లేవు. గ్రామాల సమీపంలోని కాలువలైతే మురుగు కూపాలుగా మారాయి.

ఆక్రమణలతో నీరందడం లేదు ఎస్సారెస్పీ డీ–64 కాలువ మండలం



లోని అనేక గ్రామాల గుండా వెళుతోంది. దీని ఉప కాల్వలు పిచ్చిమొక్కలు, ఎండిన చెట్ల కొమ్మలతో నిండిపోయాయి. నీరు పారడం ప్రశ్నార్థకంగా మారింది. పలు చోట్ల ఆక్రమణలకు గురికావడంతో నీరు పారే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు అంటున్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టి ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

అడవి కాదు.. కాలువే..ధర్మపురి మండలం దమ్మన్నపేటకు వెళ్లే రోళ్లవాగు పిల్ల కాలువల దుస్థితి ఇది. ఈ కాలువ ద్వారా దమ్మన్నపేట, రాజారం గ్రామాలకు సాగు నీరందించాల్సి ఉండగా ఏనాడూ దీనిని పట్టించుకున్న నాథుడు లేడు. కాలువ కింద సుమారు 500 ఎకరాల వరకు సాగు నీరందిం చాల్సి ఉంది. చెట్టపొదలు పెరిగి కాలువ అడవిని తలపిస్తోంది. కాలువల్లో పొదలను తొలగించి చివరి ఆయకట్టుకు సాగు నీరందించా లని రైతులు కోరుతున్నారు.

ఏళ్లుగా మరమ్మతు కరవుపెగడపల్లి, వెంగళాయిపేట, లింగాపూర్, బతికెపల్లి గ్రామాల రైతులకు సాగునీరు అందే డీ76 ప్రధాన కాలువ కల్వర్టులు కూలిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయి పరిస్థితి అధ్వానంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో చిట్టడవిని తలపిస్తుంది. ప్రతీ ఏటా చివరి ఆయకట్టు రైతుకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి.

## ప్రజారోగ్యంపై పర్యవేక్షణ లోపం

పెద్దపల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్తు విభాగాల్లో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. కీలక బాధ్యతల్లో ఇన్‌ఛార్జి అధికారులే ఉండటం ప్రభావం చూపుతోంది. జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షకుడు రమాకాంత్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా ఆవిర్భావం తర్వాత పూర్తి స్థాయిలో వైద్యారోగ్య శాఖ అధికారులను నియమించకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ, రోగుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం సైతం వైద్య విధాన పరిషత్తును రద్దు చేసి, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఏర్పాటును యోచిస్తుండటంతో ఇన్‌ఛార్జి వైద్యాధికారుల విషయంలో త్వరలోనే కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశాలున్నాయి.

ముందస్తు జాగ్రత్తలేవీ!

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ దీర్ఘకాలికంగా ఇక్కడ పని చేస్తున్నారు. కొద్ది రోజులుగా ధర్మారం, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ముందుజాగ్రత్తగా దోమల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు డెంగీ ప్రబలిన తర్వాత అప్రమత్తం చేయడం వల్ల ఉపయోగం ఉండదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల కల్పన మిథ్యగా మారింది. మొత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు–18, పల్లె దవాఖానాలు–66, బస్తీ దవాఖానాలు–4, పట్టణ ఆరోగ్య కేంద్రాలు–7, ఆరోగ్య మహిళ కేంద్రాలు–6, వైద్య విధానపరిషత్తు ఆసుపత్రులు–4 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజూ 3 వేల వరకు ఓపీ నమోదవుతోంది. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నతాధికారుల నుంచి వైద్యుల వరకు ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తుండటంతో వాటిపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో జిల్లా స్థాయి కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడం, ప్రజాప్రతినిధులు కూడా క్షేత్ర స్థాయిలో వైద్య సేవలను పరిశీలించకపోవడంతో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. వైద్యారోగ్య శాఖను సమూల ప్రక్షాళన చేస్తేనే సేవలు మెరుగవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అత్యవసరమైతే సిఫార్సులే(నా)!

రెండు రోజుల కిందట పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సెప్టిక్‌ట్యాంకులో పడిన బాలుడు జాన్‌వెస్లీకి స్థానికంగానే చికిత్స చేయాల్సి ఉంది. ప్రమాదానికి గురైన గంటకు గుర్తించగా, తీసిన వెంటనే ఆసుపత్రి అత్యవసర విభాగానికి తరలించి త్వరగా చికిత్స ప్రారంభిస్తే బతికేవాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అత్యవసర విభాగంలో వెంటిలేటర్లు, రోగులను చికిత్స అందించేందుకు మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ రమాకాంత్ వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్‌కు చేరుకోవడానికి ఎంత లేదన్నా అర గంట సమయం పడుతుంది. జిల్లా ఆసుపత్రిలో ఆ సమయంలో స్థానికంగా మెరుగైన చికిత్స అందేది.

రహదారి ప్రమాదాలు, గుండె నొప్పి, పాముకాటు తదితర అకస్మాత్తుగా తలెత్తే అనారోగ్య సమస్యలపై రోగులు ప్రభుత్వాసుపత్రి వైపు చూస్తుండగా ఆవరణలో జరిగిన ప్రమాద బాధితుడిని దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం పరిస్థితికి అద్దం పడుతోంది.

వ్యయ ప్రయాసలను భరించి చికిత్స కోసం పెద్దపల్లి జిల్లాసుపత్రికి వస్తే అత్యవసర వైద్యానికి ఇక్కడ చికిత్స అందడం లేదు. వెంటనే కరీంనగర్‌కు వెళ్లండని ఇక్కడి వైద్యులు చెబుతుండటం, తమకు తెలిసిన ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తుండటం పరిపాటిగా మారింది.

# సొరంగ మార్గం మూసుకుపోయినట్లేనా..?




హైదరాబాద్: నగరంలో ప్రపంచస్థాయి సొరంగ మార్గాలను నిర్మించి ప్రజారవాణాను మెరుగు పరచాలన్న ప్రణాళికలు ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటివరకు అటకెక్కిన గతంలోని ప్రాజెక్టుల మాదిరే.. కేబీఆర్ పార్కు కింద నిర్మించాలనుకున్న రోడ్డు మార్గం కూడా సందిగ్ధంలో పడింది. నిర్మాణానికి రూ.3 వేల కోట్ల భారీ వ్యయమవుతుందని అధ్యయన నివేదిక తేల్చి చెప్పడంతో జీహెచ్‌ఎంసీ మౌనం వహిస్తోంది. దీంతో ఐదు సొరంగ మార్గాల ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

లాభనష్టాలపై అయోమయం..

బంజారాహిల్స్ రోడ్డు నెం.3లోని షేక్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెం.45 కూడలి అవతలి వరకు దాదాపు 6.3కి.మీ పొడవుతో సొరంగ మార్గాన్ని నిర్మించాలనేది ప్రణాళిక. ప్రభుత్వ అధ్యయనం ప్రకారం.. రూ.3వేల కోట్లు అవసరమని అంచనా. ఈ నేపథ్యంలో ముందుకువెళ్లాలా, లేదా అనే ప్రశ్న జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలిచేస్తోంది.

అటకెక్కుతున్న ప్రణాళికలు..: ఇనార్బిట్‌మాల్ ఎదురుగా ఉండే గుట్టను తొలిచి ఖాజాగూడ కూడలి వైపు సొరంగ మార్గం నిర్మించాలని భావించగా.. ప్రాజెక్టు వ్యయం రూ.1000కోట్లు అవడంతో ప్రతిపాదన తెరమరుగైంది. బేగంపేట విమానాశ్రయం కింద 1.1కి.మీ సొరంగ మార్గం నిర్మించాలన్న లక్ష్యం ఆదిలోనే అటకెక్కింది.

కొత్త మార్గాలపై అధ్యయనం..

గతంలోని ప్రతిపాదనలపై మౌనం వహిస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐదు రహదారుల కింద సొరంగ మార్గాలను నిర్మించాలని అధ్యయనం చేపట్టింది. అందుకోసం జీహెచ్‌ఎంసీ చేస్తోన్న ప్రయత్నాలు ఫలించట్లేదు. అధ్యయనానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తే టెండర్లకు స్పందన రావట్లేదు. ఐటీసీ కోహినూర్ నుంచి విప్రో కూడలి వరకు (వయా ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ), ఐటీసీ కోహినూర్ నుంచి జేఎన్‌టీయూ కూడలి వరకు(వయా మైండ్‌స్పేస్ కూడలి), ఐటీసీ కోహినూర్ నుంచి బంజారహిల్స్ రోడ్డు నెం.10(వయా జూబ్లీహిల్స్ రోడ్డు నెం.45), జీవీకే1 మాల్ నుంచి నానల్‌నగర్(వయా మాసబ్ ట్యాంక్), నాంపల్లి నుంచి చాంద్రాయణగుట్ట(వయా చార్మినార్, ఫలక్‌నుమా) రహదారులను సొరంగమార్గం నిర్మాణానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

# సామాజిక మాధ్యమం.. నేరాల వలయం



హైదరాబాద్: రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు.. పరువు తీసేలా మార్ఫింగ్ ఫొటోలు.. కన్నీరు కురిపించే కట్టుకథలు. ఆపదలో ఉన్నానంటూ కల్లబొల్లి కబుర్లు.. అంశం ఏదైనా లక్ష్యం మాత్రం అందినంత దండుకోవటం. కుదరకుంటే అవతలి వారిని మానసికంగా దెబ్బతీయటం. వీటికి సామాజిక మాధ్యమాలు వేదికగా మారాయి. దూరాలను దగ్గర చేసిన ఈ వేదికలు ప్రస్తుతం నేరవలయంగా తయారయ్యాయి. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరూ బాధితులవుతున్నారు. నగర సైబర్ క్రైమ్ ఠాణాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 1400కుపైగా సైబర్‌నేరాల కేసులు నమోదు చేశారు. వీటిలో 400కుపైగా ఫిర్యాదులు సామాజిక మాధ్యమాల వేదికగా చోటుచేసుకున్నవే.

రూటు మార్చిన మాయగాళ్లు

రాజస్థాన్ భరత్‌పూర్ కేంద్రంగా సైబర్ నేరస్థులు గతంలో సినీ, రాజకీయ, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్‌నెంబర్లు, ఫొటోలను ఉపయోగించుకొని సొమ్ము కొట్టేసేవారు. ప్రముఖుల ఫొటోలను వాట్సాప్ డీపీగా ఉపయోగించి ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వారి పేర్లతో తాము అత్యవసర పరిస్థితుల్లో ఉన్నామని.. డబ్బు కావాలంటూ నగదును తమ బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయించుకునేవారు. వీటిపై అవగాహన పెరగటంతో ఇప్పుడు రూటు మార్చారు. అందమైన యువతుల నగ్న వీడియోల లింక్‌లను వాట్సాప్ నెంబర్లకు పంపుతున్నారు. పూర్తి వీడియో చూడాలనే ఆసక్తితో లింక్‌లను క్లిక్ చేసిన వారి వాట్సాప్ ఖాతాలు సైబర్ నేరస్థుల చేతుల్లోకి వెళుతున్నాయి. బాధితులు తమ ఖాతాలను పునరుద్ధరించుకునే అవకాశం లేకపోవటాన్ని అవకాశంగా చేసుకుంటున్నారు. అందులోని కాంటాక్టు నెంబర్లకు సందేశాలు పంపి ఆసుపత్రిలో ఉన్నామని, దూరప్రాంతాలకు వెళితే అక్కడ నగదు చోరీ అయినట్టు మాయమాటలతో బాధితుల స్నేహితులు, బంధువుల నుంచి నగదు కాజేస్తున్నారు. తెలిసిన నెంబర్ నుంచే సందేశం రావటంతో తేలికగా నమ్ముతున్నారు.

ఫేస్‌బుక్ ఖాతాలతో విచిత్రాలెన్నో

వాడకంలోని లేని ఫేస్‌బుక్ ఖాతాలు మరుగున పడుతుంటాయి. వీటిని హ్యాక్ చేసిన నైజీరియన్లు ఫ్రెండ్స్ జాబితాలోని వారి నుంచి నగదు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు నగ్న ఫొటోలు, వీడియోలు ఉంచి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఖాతాలను తొలగిస్తే చాలంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దుబాయ్, సింగపూర్ తదితర దేశాల్లో ఉంటూ స్థానిక యువతకు డబ్బు పంపి సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ ఛానళ్లు నడుపుతున్న ప్రబుద్ధులున్నారు. సున్నితమైన విషయాలను రెచ్చగొట్టేలా వీడియోలు, పోస్టులు రూపొందించడమే వీరి ఎజెండా. గతేడాది నగరంలో రెండు వర్గాల మధ్య గొడవలు పెట్టేందుకు దుబాయ్ నుంచి ఇదే తరహా ఎత్తులు వేసిన పాతబస్తీ యువకుడిని ఇటీవలే పోలీసులు అరెస్ట్ చేశారు. టెలిగ్రాం, ఇన్‌స్టా ఉపయోగించేవారు క్రమంగా పెరుగుతున్నారు. ఈ యాప్‌లను వేదికగా మలచుకొని ముంబయి, బెంగళూరు, దిల్లీకి చెందిన డ్రగ్స్ ముఠాలు లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల టీజీన్యాబ్‌కు పట్టుబడిన ముఠాల్లో అధికభాగం వీటి ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు అంగీకరించారు.

# శునకం.. జనములో కలవరం



కరీంనగర్ : ఒకప్పుడు వీధుల్లో కుక్కలు కనిపిస్తే పెద్దగా పట్టించుకోని జనం ఇప్పుడు అవి కనిపిస్తే భయపడుతున్నారు.. వాటి పక్క నుంచి వెళ్లడానికి జంకుతున్నారు.. రోడ్డుపై నడిచే వారిని.. ద్విచక్ర వాహనదారులపై అవి క్రూరంగా దాడి చేస్తుండటమే అందుకు కారణం.. ఉమ్మడి జిల్లాలో రోజూ ఎక్కడో ఒకచోట కుక్కల దాడి ఘటనలు జరుగుతున్నా.. స్థానిక సంస్థల పాలకవర్గాలు.. అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.. ఈ నేపథ్యంలో వీధి కుక్కలను నియంత్రించాలని.. వాటి దాడి నుంచి జనాన్ని రక్షించే చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలివ్వడంతోనైనా పరిస్థితి మారేనా అని ఉమ్మడి జిల్లావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరీంనగర్ జనరల్ ఆస్పత్రికి 570 మంది కుక్క కాటు బాధితులు వచ్చి చికిత్స అందుకున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులతోపాటు పల్లెల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్న వారి సంఖ్య మరో 600కుపైగా ఉంటోంది. ఒక్క జిల్లాలోనే గడిచిన ఆరు నెలలుగా 1,170 కేసులున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 4500ను దాటుతున్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య దాదాపుగా రెండింతలుంటోంది. సగటున రోజుకు 50 మంది వరకు ఏదో ఒక చోట గ్రామసింహాల కారణంగా గాయపడుతున్నారు.

కుక్క కరిచినప్పుడు కచ్చితంగా 5 ఇంజక్షన్లు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా పలు కుటుంబాలు నష్టపోతున్నాయి. తీవ్రగాయాలైనప్పుడు హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కుట్లు వేయాల్సిన సందర్భాల్లో చికిత్స ఖర్చు రూ.వేలల్లో ఉంటోంది. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నా అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తుండటంతో ఒక్కో ఇంజక్షన్‌కు రూ.300 నుంచి రూ.350 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తీవ్రంగా గాయమైనప్పుడు యాంటీరాబిస్ ఇమినోగ్లోబిన్ సూది మందుకు రూ.6 వేల వరకు ఖర్చవుతోంది.

నియంత్రణ లేదు.. టీకా రాదు

కుక్కల సంతాన నియంత్రణకు శస్త్ర చికిత్సలు జరగడం లేదు. దీంతో వాటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. గతంలో కొన్నిచోట్ల వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టినా.. నిధుల లేమితో నిలిపేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఈ ప్రక్రియ జరగడం లేదు. మరోవైపు వీధుల్లో సంచరించే శునకాలకు ముందస్తు వ్యాక్సిన్ వేస్తే జనం రేబిస్ బారిన పడకుండా ఉంటారు. ఒక శునకానికి మొదటి, రెండు డోసుల వ్యాక్సిన్ వేస్తే ఏడాది వరకు పనిచేస్తుంది. పంచాయతీలు, పురపాలికల్లో ఇందుకు ప్రత్యేక నిధులు లేవు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావు. దీంతో స్థానిక ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పురపాలిక, పంచాయతీ, వెటర్నరీ అధికారులు సమన్వయంతో సాగి కుక్కల సంతాన నియంత్రణ, వ్యాక్సిన్‌పై నిర్ణయం తీసుకుంటే జనానికి ఇబ్బంది తగ్గుతుంది.

వీధి కుక్కలతో ప్రమాదం

ఇటీవల వీధి కుక్కల వల్ల ప్రమాదం పెరుగుతోంది. పెంపుడు కుక్కలకు యజమానులు కచ్చితంగా వ్యాక్సిన్ వేయిస్తున్నారు. దీంతో వాటితో ముప్పు ఉండటం లేదు. బయట తిరిగే వాటితో జనం జాగ్రత్తగా మెలగాలి. వర్షాలు పడిన తరువాత వాటి మానసిక పరిస్థితిలో మార్పు వస్తుంటుంది. అందుకనే అవి కనిపించిన వారిని కరుస్తుంటాయి.డాక్టర్ కిరణ్, వెటర్నరీ వైద్యుడు, కరీంనగర్

సత్వర చికిత్స మేలు

కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి తరలించాలి. అలా చేయడం వల్ల రేబిస్ ముప్పును చాలావరకు తప్పించుకునే వీలుంది. గతంలో పోలిస్తే చిన్నారులపై కుక్కల దాడులు పెరుగుతున్నాయి. వాటిని చూడగానే పరుగెత్తొద్దు. దీంతో మరింత క్రూరంగా ప్రవర్తిస్తూ గాయపరుస్తున్నాయి. రేబిస్ సోకిన కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. శరీరంపై పుండ్లు ఉన్న వ్యక్తులను కుక్క నాకినా.. కచ్చితంగా వ్యాక్సిన్ తీసుకోవాలి.

డాక్టర్ అజయ్, పిల్లల వైద్య నిపుణులు, కరీంనగర్ జనరల్ ఆస్పత్రి

ఎందుకింత క్రూరంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాంసం విక్రయాలు విపరీతమయ్యాయి. పట్టణాల్లో మాంసం దుకాణదారులు ఇష్టం వచ్చినట్లుగా వ్యర్థాలను పడేస్తుండగా కుక్కలు వాటికి అలవాటు పడుతున్నాయి. ఆ ఆహారం దొరకని సమయంలో పిచ్చిగా ప్రవర్తిస్తూ మనుషులపై దాడికి పాల్పడుతున్నాయి.

గ్రామాల్లో కోళ్ల ఫారాల సంఖ్య పెరిగింది. అక్కడ నిత్యం మృతి చెందిన కోళ్లను ఇవి తింటూ ఆ ఆహారానికి అలవాటు పడ్డాయి. వరుసగా రెండు, మూడు రోజులు దొరకని సమయంలో ఆకలి తీర్చుకునేందుకు కనిపించిన వారిని కరుస్తున్నాయి.

నీడ పట్టున సేద తీరుతున్న వాటిని వెళ్లగొడితే అవి వికృతంగా ప్రవర్తిస్తుంటాయి. నిద్రలో నుంచి లేచి ఆ కసితో కనిపించిన వారిపై ప్రతీకారాన్ని తీర్చుకుంటాయని వెటర్నరీ వైద్య నిపుణులు చెబుతున్నారు.

# సర్వేలతోనే సరి.. విస్తరణ ఎప్పుడో మరి?

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలోని రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. దీంతో ఏ మార్గంలో వెళ్లినా ఎక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటామోనని భక్తులు, స్థానికులు భయపడుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో ప్రతిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి స్వామివారి దర్శనానికి వస్తుంటారు. దీంతో ఆలయ పరిసరాల రోడ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తుంటాయి. భక్తులు, స్థానికులు పడే ఇబ్బందులను తొలగించేందుకు రాజన్న ఆలయం నుంచి వంతెన వరకు, మరో వైపు పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరించాలనే ప్రతిపాదనకు మోక్షం లభించడం లేదు. ఇందుకు సంబంధించి 2023 ఫిబ్రవరిలో ప్రధాన రహదారిని సర్వే చేసి నివేదిక సిద్ధం చేసినా ఇప్పటి వరకు పనుల్లో కదలిక లేదు. ఆర్టీసీ బస్టాండ్‌లో దిగిన భక్తులు వంతెన మీదుగా ఆలయానికి చేరుకోవడం.. స్వామివారి దర్శనం అనంతరం ఇదే ప్రధాన దారి మీదుగా బస్టాండ్‌కు వెళ్తుంటారు. ఇలాంటి రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుంటాయి.

పరిహారం పంపిణీకి అంచనాలు..




గత ప్రభుత్వ హయాంలో రాజన్న ఆలయం నుంచి మూలవాగు వంతెన వరకు దాదాపు 80 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించాలని ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), సర్వే బృందం సర్వే చేసి ఏ మేరకు గృహాలు నష్ట పోతున్నాయనేది గుర్తించి మార్కింగ్ చేశారు. దాదాపు 255 గృహాల వరకు నష్టపోతున్నట్లు అధికారులు గుర్తించారు. రోడ్ల విస్తరణలో నష్టపోయే గృహాల యజమానులకు పరిహారం అందించేందుకు దాదాపు రూ.35 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. నిధులు రాకపోవడంతో పనులు మొదలు కావడం లేదు. సర్వే చేసి ఏడాదిన్నర కాలం కావస్తున్నా పనుల్లో జాప్యంతో పట్టణ ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

నిధులు విడుదలవక పనుల్లో జాప్యం రాజన్న ఆలయం ముందు నుంచి వంతెన వరకు రోడ్డు విస్తరణకు సర్వే చేసి అంచనాలు సిద్ధం చేశాం. దాదాపు 255 ఇళ్ల వరకు నష్టపోతున్నాయి. వాటికి రూ.35 కోట్ల వరకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. నిధులు విడుదలవుతేనే పనులు చేపట్టడానికి అవకాశం ఉంది. అందుకే విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది.సత్యనారాయణ, ఎస్టేట్ అధికారి వీటీఏడీఏ

# ఊపందుకోని సాగు

జగిత్యాల : వ్యవసాయశాఖ తాజా గణాంకాల ప్రకారం కరీంనగర్ జిల్లాలో సాధారణంకన్నా అధికంగా, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంగా లెక్కించినా ముసురు వర్షంలేక భూగర్భ జలమట్టం పెరగకపోవటం, ఎండల తీవ్రత, వర్షాభావం, ఆయకట్టుకు కాలువనీళు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేకపోవటంతో ఉమ్మడి జిల్లాలో కాడి నెమ్మదిగానే కదులుతోంది. ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో అన్నిపైర్ల సాగు 16.57 శాతమే కాగా పెద్దపల్లి 22.03, జగిత్యాల 14.19, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26.28 శాతంగా నమోదైంది.

కురవాల్సిన వర్షపాతంకన్నా 19 శాతం హెచ్చుతగ్గులుగా వర్షం కురిసినా సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తారు. కురవాల్సిన వర్షంకన్నా ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 32.0, పెద్దపల్లిలో 8.5, జగిత్యాలలో 17.7, సిరిసిల్ల జిల్లాలో 12.5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పట్నుంచి తగిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొనటంతో పంటలసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది. జిల్లాకు నీరందించే శ్రీరామసాగర్, మధ్యమానేరు, దిగువమానేరు, ఎల్లంపల్లి తదితర జలాశయాల్లో కనిష్ఠస్థాయిలోనే నీటినిల్వలుండటంతో భారీవర్షాలు కురిసి వరదనీరు వస్తే తప్పితే



ఆయకట్టుకు ఇప్పట్లో నీటిని వదిలే అవకాశంలేదు. ఈ నేపథ్యంలో వర్షాలు, భూగర్భ జలాల ఆధారితంగా పంటలను సాగుచేస్తుండగా వర్షాలు మరింతగా పెరిగితేనే సాగు గరిష్ఠానికి చేరుతుంది. ఈ వానాకాలంలో 9.5 లక్షల ఎకరాల్లో వరిని సాగుచేస్తారని అంచనాకాగా ప్రస్తుతం వరినార్లతో పాటుగా నాట్లు వేస్తున్నారు. స్వల్పకాలిక రకాలతో వరి నార్లకు ఈ నెలాఖరు వరకు, అతిస్వల్పకాలిక రకాలతో ఆగస్టు మొదటివారం వరకు, వరినాట్లకు ఆగస్టు నెలాఖరు వరకు సమయముంది. ఇప్పటివరకు 1.45 లక్షల ఎకరాల్లో పత్తిపంటను విత్తుకోగా ఈ నెలాఖరు వరకు సమయముండటంతో మరో 55 వేల ఎకరాల పత్తిసాగు పెరిగే అవకాశముంది. కంది, మక్క, ఇతర పంటలను ఈ నెలాఖరు విత్తుకునే అదనుండగా 56 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 32 వేల ఎకరాల్లో పసుపు, 11 వేల ఎకరాల కంది తదుపరి ప్రధాన పంటలుగా ఉండనున్నాయి. ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్నారు.

## పెంపుడు జంతువులకూ మహాప్రస్థానం

రాయదుర్గం: అల్లారుముద్దుగా పెంచుకునే పెంపుడు జంతువు మృత్యువాత పడినపుడు కుటుంబంలోని సభ్యుడే దూరమైనంత వేదన అనుభవిస్తారు యజమానులు.. ఆ దుఃఖం ఒకవైపు కలచివేస్తుంటే.. అంత్యక్రియలు ఎక్కడ చేయాలో తెలియక బాధపడతారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు.. పెంపుడు జంతువులకూ ఓ మహాప్రస్థానం అందుబాటులోకి రాబోతుంది. రాగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పా'మెమోరీస్ పేరుతో గోపన్‌పల్లిలో నిర్మించిన ఈ శ్మశానవాటికను వచ్చే నెల మొదటివారంలో ప్రారంభించనున్నారు. గోపన్‌పల్లి శ్మశానవాటిక చెంత 500 గజాల స్థలాన్ని జీహెచ్‌ఎంసీ ఈ పా మెమోరీస్‌కు కేటాయించింది. గ్యాస్ ఆధారిత ఆరడుగుల దహన వాటిక ఉంటుంది. కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, పక్షులు తదితరాలకు వీడ్కోలు పలకవచ్చు. కళేబరాలు భద్రపరిచేందుకు ఫ్రీజర్ రూం ఏర్పాటుచేశారు. జంతువుల కళేబరాలు కాలిపోయాక వెలువడే బూడిదను యజమానులు తీసుకెళ్లకపోతే శ్మశాన వాటికలోని మొక్కలకు ఎరువులా ఉపయోగిస్తామని రాగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నందకిషోర్ తెలిపారు. దహన సంస్కారాలకు రూ.2500 ఛార్జీ ఉంటుందన్నారు.

# పూడిక తొలగేనా..?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన వరదకాలువలు ఉండగా ఏటా వర్షాకాలం రాకముందే పూడికతీత పనులు చేయిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా పూడిక, చెత్తాచెదారం తొలగించడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగా ఆ పనులను గుత్తేదారులకు అప్పగించనున్నారు. వచ్చే నెల మొదటి వారంలోగా పనులు పూర్తి చేసి వర్షం నీరు సాఫీగా ప్రవహించేలా పూడికను తొలగించాలని భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో వరద కాల్వలు శుభ్రం చేయకుండా ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే పూడికను తొలగించేలా టెండర్‌లలో పొందుపర్చారు.

అధ్వానంగా అంతర్గత కాలువలు

ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాల్వలతో పాటు అంతర్గత వీధుల్లోని డ్రైనేజీలలో మట్టి పేరుకుపోయింది. కొన్నిచోట్ల మూసుకుపోగా, మరికొన్ని చోట్ల చెత్తాచెదారం నిండి ఉంది. ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. డ్రైనేజీలలో చెత్తను తొలగించడం లేదు. మురుగునీరు అలాగే నిలిచి ఉంటుంది. గతంలో ఎప్పటికప్పుడు పనులు చేసే వారు. కొన్ని నెలలుగా కార్మికులు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పట్టనట్లుగా ఉంటున్నారు.

శుభ్రం చేస్తేనే..నూతన రహదారులు నిర్మించిన చోట బహిరంగ కాల్వలే కనిపించడం లేదు. పైపులైనుతో డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ప్రతీ వంద మీటర్లకు ఒక ఛాంబర్ ఇస్తుండగా దాని పక్కనే పైపులతో రంధ్రాలు వదిలేశారు. వర్షం నీరంతా ఇందులోంచే వెళ్లాల్సి ఉండగా అవి మూసుకుపోయాయి. డివిజన్ల వారీగా వీటన్నింటినీ పరిశీలించి చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయిస్తే నీరంతా డ్రైనేజీల్లోకి వెళ్లే అవకాశముంది.

15 రోజుల్లో పూర్తికి చర్యలు..

వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా ముందస్తుగా నాలాలు, డ్రైనేజీలు శుభ్రం చేసే పనులు వెంటనే ప్రారంభించనున్నాం. వరద కాల్వలు గుత్తేదారులతో, మురుగునీటి కాల్వలు కార్మికులతో శుభ్రం చేయిస్తాం. 15 రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలకు ఆదేశించాం. బి.శ్రీనివాస్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

పూడికతీత పనులు ఇక్కడే..

గౌతమినగర్, అమీర్‌నగర్, కోతిరాంపూర్, కట్టరాంపూర్, భగత్‌నగర్ వైపు ఉన్న వరదకాల్వ

మల్కాపూర్ రోడ్డు చౌరస్తా నుంచి శాతవాహన యూనివర్సిటీ నుంచి కొత్త లేబర్ అడ్డా జ్యోతినగర్

రాంనగర్ పారమిత, సిద్ధార్థ స్కూల్స్ నుంచి చేపల మార్కెట్

వాణినికేతన్ స్కూల్ వెనుక నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టురాంనగర్ చౌరస్తా నుంచి మార్క్‌ఫెడ్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ డ్రైనేజీ

రైల్వేట్రాక్(ఈ19) నుంచి తీగలగుట్టపల్లి ప్రధాన రహదారి రైల్వే గేట్

ముకరంపుర పరివార్ బేకరీ నుంచి సాయికృష్ణ థియేటర్ వరకు, ఇక్కడి నుంచి కలెక్టరేట్, కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ స్టేడియం

శనివారం అంగడి బజారు నుంచి వరాహస్వామి గుడి వరకు గల వరదకాల్వప్రభుత్వాసుపత్రి ఎదురుగా నుంచి శర్మనగర్ మీదుగా శనివారం అంగడి బజారు

సాయిబాబా టెంపుల్ నుంచి గౌరిశెట్టి కాంప్లెక్స్

డీ94 కాలువ నుంచి జగిత్యాల రోడ్డు.. అక్కడి నుంచి రేకుర్తి వరకు.

డీ94 కాలువ నుంచి గౌడ్స్ కాలనీ

దోబీఘాట్ జంక్షన్ నుంచి హెూటల్ శ్వేత, తారక వరకు.

# ఏటా ముప్పు.. ఏదీ కనువిప్పు

కోరుట్ల : జిల్లాలోనే రెండో అతి పెద్ద పట్టణం కోరుట్లలో ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జులై వచ్చిందంటే ఎప్పుడు వరదలు ముంచెత్తుతాయోనని పట్టణ ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రకాశంరోడ్, అయిలాపూర్, ఝాన్సిరోడ్, అయిలాపూర్‌రోడ్, ఆదర్శనగర్, తాళ్ల చెరువు కింది ప్రాంతాల్లోని కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయి. రోడ్లపై మూడు అడుగుల మేర రోజుల తరబడి వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. ఇళ్లలోకి వరదనీరు చేరి ప్రజలు రోజుల తరబడి బయటకు రాని పరిస్థితులు నెలకొంటాయి. ఇళ్లు వరదల్లో చిక్కుకోవడంతో ఖాళీ చేయాల్సిన దుస్థితి ఉంటుంది. ఏటా అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వరద ముంపు ప్రాంతాలను సందర్శించి వెళ్లడం తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదు.

కాలువలపై పట్టింపేదీ..?

కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నిండిన తర్వాత అక్కడి నుంచి పట్టణంలోని పీతిరికుంట, కంచరకుంట, మద్దుల చెరువు, లస్కగౌడ్‌కుంట, బొల్లికుంట, అయిలాపూర్ పాడిచెరువు, పెద్దచెరువులను కలుపుతూ గతంలో గొలుసుకట్టు చెరువులు, కాలువలు ఉండేవి. స్తంభాల చెరువు మత్తడి దూకిన నీరు షరాబుకుంట, తాళ్లచెరువులో చేరిన తర్వాత మత్తడి దూకి కాలువ ద్వారా కోరుట్లలోని ఫుల్‌వాగులో కలుస్తుండేది. స్తంభాల చెరువు కిందున్న చెరువులు, కుంటలు, కాలువలు చాలావరకు ఆక్రమణకు గురయ్యాయి. ప్రధాన కాలువలు తరచూ కోతకు గురవుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్లు, కాలనీలను ముంచెత్తుతోంది. కంచరకుంటకు వెళ్లే కాలువ బీలాల్‌పుర, ఏసుకోనిగుట్ట వద్ద దెబ్బతిని తరచూ కోతకు గురవుతోంది. కంచరకుంట మత్తడి నుంచి పారే నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఆదర్శనగర్ పూర్తిగా జలమయమవుతోంది. మద్దుల చెరువు మత్తడి కిందున్న ప్రకాశంరోడ్‌లోని కాలువ పట్టా భూమిలో ఉండటంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కాలువను ఆక్రమించుకోవడంతో 10-15 అడుగులు ఉన్న కాలువ 3, 4 అడుగులకు కుచించుకుపోయాయి. ఈ కాలువను పలువంకలుగా మల్చడంతో నీరు సరిగా ముందుకుసాగక రోడ్డుపై ప్రవహిస్తుంది.

రోజుల తరబడి నీటిలోనే..

కోరుట్ల పట్టణంలోనే అత్యంత లోతట్టు ప్రాంతం ప్రకాశంరోడ్, ఝాన్సిరోడ్, అయిలాపూర్‌రోడ్ కాలనీలు చిన్నపాటి వర్షానికే పూర్తిగా జలమయమవుతున్నాయి. పైప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరంతా మురుగు కాలువల ద్వారా ముందుగా మద్దుల చెరువులో చేరుతోంది. స్తంభాల చెరువు నీరు కాలువ ద్వారా కంచరకుంటకు చేరి అక్కడి నుంచి మత్తడి దూకి ఆదర్శనగర్ నుంచి వచ్చి మద్దుల చెరువులో కలుస్తుంది. దీనికితోడూ గాంధీరోడ్, తిలక్‌రోడ్, గోదాంరోడ్, చిన్నతోటవాడ, అయిలాపూర్, ప్రకాశంరోడ్‌ల నుంచి మురుగు కాలువ ద్వారా వర్షపు నీరు లోతట్టు ప్రాంతానికి చేరుతుంది. మద్దుల చెరువు మత్తడి నుంచి వచ్చే నీరు మురుగు కాలువలో వేగంగా పారుతుండటంతో అదే కాలువలో ప్రకాశంరోడ్‌లోని పలు మురుగు కాలువల నీరు కలుస్తుంది. దీంతో మురుగు కాలువలలో నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా వరద ముంపునకు గురవుతున్నాయి. రోజుల తరబడి కాలనీలు వరద నీటిలో చిక్కుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

# నకిలీ దందాపై ఉక్కుపాదం



పెద్దపల్లి : మరో మూడు రోజుల్లో రోహిణి కార్తె ప్రవేశించనుండటంతో వానాకాలం పంటల సాగుకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా విత్తనాల కొనుగోలులో రైతులు మోసపోతున్నారు. దళారులు దిగుబడుల ఆశ చూపి నకిలీ సరకు అంటగడుతుండటంతో నష్టపోతున్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. అంతర్‌రాష్ట్ర సరిహద్దు నుంచి, రైల్వే మార్గంలో వస్తుండటంతో వాటి నియంత్రణ కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో నకిలీ విత్తన దందాపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించింది. వ్యవసాయ, పోలీసు అధికారులతో పాటు విత్తనోత్పత్తి సంస్థల భాగస్వామ్యంతో కమిటీ నిఘా పెంచింది.

నిషేధిత విత్తనాలు సైతం..

రైతులు ఏటా నకిలీ, కల్తీ విత్తనాలతో నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించినా పంట దిగుబడి రాకపోగా అప్పులే మిగులుతున్నాయి. జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతుండగా నకిలీ వరి విత్తనాలు సక్రమంగా మొలకెత్తకపోవడం, దిగుబడి రాకపోవడం పరిపాటిగా మారింది. కలుపు నాశని మందులను తట్టుకునే జన్యు మార్పిడి రకాలైన బీటీ-3 విత్తనాలతో పత్తి సాగులో శ్రమ తక్కువ ఉంటుందంటూ దళారులు ప్రచారం చేస్తున్నారు. దీంతో రైతులు వాటి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. అయితే పత్తిలో గ్లైఫోసెట్(గడ్డిమందు) పిచికారీ వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించడంతో ప్రభుత్వం బీటీ-3 రకం పత్తి విత్తనాలను నిషేధించింది. అయితే పలు చోట్ల వ్యాపారులు వాటిని రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్ధారణ అయితే కేసులు

జిల్లాలో వానాకాలంలో 2,77,743 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. 2,08,814 ఎకరాల్లో వరి, 57,269 ఎకరాల్లో పత్తి, 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్, మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు వేయనున్నారు. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయ, పోలీసు, విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులతో నియమించిన టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. నకిలీ సరకులపై వీరికి నేరుగా ఫోన్ చేసినా, ఫిర్యాదు చేసినా దాడులు చేసి స్వాధీనం చేసుకుంటారు. నిర్ధారణ అయితే కేసులు నమోదు చేస్తారు. మండల స్థాయిలో ఏవో, ఎస్సై, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

శ్రీనాథ్, ఏడీఏ, పెద్దపల్లి 72888-94148

కిషోర్‌కుమార్, ఏడీఏ, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ, 72888-79669

మల్లయ్య, ఏఎస్సై, మంథని 94404-61918

అప్రమత్తతే కీలకం

విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేసిన వెంటనే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.

అధికారులు సిఫార్సు చేసిన నాణ్యమైన, అధిక దిగుబడి వచ్చే రకం విత్తనాలనే ఎంచుకోవాలి.

తక్కువ ధరకు అమ్ముతున్నారని నాసిరకం విత్తనాలను కొని నష్టపోవద్దు.

లైసెన్సు పొందిన డీలర్లు, దుకాణదారుల వద్దనే కొనుగోలు చేయడం మేలు.

దళారుల మాటలు నమ్మి మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలి.

నిరంతర పర్యవేక్షణ

జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులపై క్షేత్ర స్థాయిలో చైతన్యం కల్పిస్తున్నాం. విత్తనాల ఎంపికలో రైతులకు ఏఈవోలు, ఏవోలు మార్గదర్శనం చేస్తున్నారు. సరకు కొనుగోలు చేసిన వెంటనే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. నకిలీలను అరికట్టడానికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది. మండలాల్లో అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తారు.డి.ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

# డివిజన్ కేంద్రం.. సేవలు జాప్యం

మంథని: మంథని డివిజన్ కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. ఎంపీడీవో, ఆర్డీవో, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పురపాలక సంఘం, ఆసుపత్రులు, ఎస్‌టీవో కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. కొన్ని కార్యాలయాల ఉద్యోగులు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో పని చేస్తుండటంతో స్థానికంగా సేవల్లో జాప్యం జరుగుతోంది.



ఆర్డీవో కార్యాలయం

ఖాళీలు: రెండు డిప్యూటీ తహసీల్దారు, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు.ప్రభావం: దస్త్రాలు త్వరగా కదలక భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో జాప్యం.

మున్సిపాలిటీమేనేజర్, పట్టణ ప్రణాళిక అధికారి(టీపీవో), ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు.ఇళ్ల నిర్మాణాలకు అనుమతిలో జాప్యం జరుగుతోంది. మంచిర్యాలకు చెందిన ఇన్‌ఛార్జి అధికారి వారానికి ఒక రోజు కూడా మంథనికి రాకపోవడంతో కొన్ని ఇళ్లను పరిశీలించకుండానే అనుమతి ఇస్తున్నారని, అన్నీ సక్రమంగా ఉన్నా కొన్నింటికి అనుమతి రావడం లేదన్న ఆరోపణలున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. మేనేజర్, సిబ్బంది అందుబాటులో లేక కార్యాలయంలో దస్త్రాల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

మండల పరిషత్తుఎంపీడీవో, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు.ఉపాధిహామీ పథకం, సామాజిక పింఛన్లు తదితర పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎంపీడీవో అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. కమాన్‌పూర్ ఎంపీడీవో మంథని బాధ్యతలు అదనంగా నిర్వర్తిస్తుండగా వారానికి రెండు రోజులు మాత్రమే వస్తున్నారు. మిగతా రోజుల్లో ఎంపీడీవో వద్దకు దస్త్రాలు తీసుకెళ్దామంటే కార్యాలయంలో సిబ్బంది కొరత నెలకొంది.

పంచాయతీరాజ్ సబ్‌డివిజన్

జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, మూడు ఏఈ పోస్టులు. (మంథని, ముత్తారం, రామగిరి, ముత్తారం మండలాలకు నలుగురు ఏఈలు విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు.)ఒకే ఏఈ ఉండటం, టెక్నికల్ అసిస్టెంట్ లేకపోవడంతో నిర్మాణం పనుల్లో జాప్యం.

కోశాగార శాఖఏటీవో, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు.

పంచాయతీలు, గుత్తేదారులు, ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు పాస్ కావడం లేదు.ఆర్ అండ్ బీ శాఖ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్, రెండు ఏఈ పోస్టులు.ఒకే ఏఈ ఉండటంతో కళాశాల భవనాలు, వంతెనలు, రహదారి నిర్మాణం పనులు ఆలస్యం.

వ్యవసాయ శాఖ మండల వ్యవసాయాధికారి పోస్టు. రామగిరి అధికారికి అదనపు బాధ్యతలు. సీజన్‌లో సేవలందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు తెగుళ్లు వచ్చినపుడు నివారణపై రైతులకు అవగాహన కల్పించడం లేదు.

గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం

జూనియర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తినపుడు అటు మిషన్ భగీరథ అధికారులు లేక, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

విద్యా శాఖ మండల విద్యాధికారి పోస్టు.

గుంజపడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి మంథని, ముత్తారం మండలాలకు ఇన్‌ఛార్జి అధికారిగా బాధ్యతలు. పాఠశాలలపై పర్యవేక్షణ లోపంతో పాటు సకాలంలో పనులు జరగడం లేదు.

ఐసీడీఎస్ కార్యాలయం

సీడీపీవో, గ్రేడ్-2 సూపర్‌వైజర్, టైపిస్టు, నైట్ వాచ్‌మెన్ పోస్టులు.

గోదావరిఖని సీడీపీవో మంథని బాధ్యతలు చూస్తుండగా వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నారు. కార్యాలయంలోని ఒప్పంద ఉద్యోగులపై పర్యవేక్షణ కరవైంది.

మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం

గైనకాలజిస్టు, మత్తు వైద్య నిపుణుడు, నాలుగు స్టాఫ్ నర్సు, రెండు ల్యాబ్ టెక్నికల్ అసిస్టెంట్, మూడు థియేటర్ అసిస్టెంట్ పోస్టులు, మూడు డాటా ఎంట్రీ ఆపరేటర్, నాలుగు ఒప్పంద ఉద్యోగులు, ఒక సెక్యూరిటీ గార్డు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గైనకాలజిస్టులు లేక గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఆపరేషన్ సమయంలో థియేటర్ అసిస్టెంట్లు లేక వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు.

సామాజిక వైద్యశాల

నలుగురు వైద్యులు, 12 స్టాఫ్ నర్సులు, ఒక ఎంఎన్‌వో పోస్టులు.

వైద్యుల కొరతతో రోగుల ఇబ్బందులు. వైద్యులు మధ్యాహ్నం వరకే అందుబాటులో ఉండటంతో సాయంత్రం, రాత్రి వేళల్లో రోగులకు వైద్య సేవలు అందడం లేదు.

నీటి పారుదల శాఖ సబ్ డివిజన్

రెండు ఏఈ, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు.

చెరువులపై పర్యవేక్షణ కొరవడింది. ఎస్సారెస్పీ కాలువ నీటి విడుదల సమయంలో పర్యవేక్షణ సరిగ్గా లేక చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి.త్వరలోనే భర్తీకి చర్యలుమంథని నియోజకవర్గ పరిధిలో అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లకు, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశించాం. ప్రస్తుతం ఉన్న ఖాళీ పోస్టులతో పాటు త్వరలో జరిగే ఉద్యోగ నియామకాల్లో నియోజకవర్గానికి ప్రాధాన్యమిస్తాం.

డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి

# నిద్రపోతున్న నిఘా.. చోరుల హల్‌చల్

రాయికల్ : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఉన్నతాధికారులు తరచూ సమావేశాల్లో చెబుతుంటారు. నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర ప్రధానమైనది. కానీ నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. రాయికల్ పట్టణంలో సుమారు 40 తులాల బంగారం, లక్ష రూపాయలు నగదు చోరీ ఘటన కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో పట్టణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సుమారు 30 సీసీ కెమెరాల పనితీరుపై, పురపాలక సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాల కోసం రూ.20 లక్షలు ఖర్చు చేసిన వైనంపై జోరుగా చర్చ జరుగుతోంది. 2017లో మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు కాగా దాతలు, విరాళాలతో పట్టణంలో సుమారు 30 సీసీ కెమెరాలు కొనుగోలు చేసి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర కిందట టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిఘా నేత్రాల పటిష్ఠత కోసం రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నా ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు అన్న అంశంపై స్పష్టత కరవైంది. దాతల సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ కరవై తీగలు తెగడం, గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో పట్టణంలో జరిగే చోరీలు, అక్రమ రవాణాను గుర్తించడంలో పోలీసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం ఠాణాలకు భారంగానే పరిణమిస్తోంది. కెమెరాల ఏర్పాటులో దాతల సహకారం తీసుకున్నా నిర్వహణకు మళ్లీ వారిని సంప్రదించడం ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం ముందుకు వచ్చి నిర్వహణ బాధ్యత తీసుకుంటేనే నిఘా నేత్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుంది. శివాజీ చౌరస్తా, అంగడిబజార్, ఇటిక్యాల క్రాస్‌రోడ్డు, గాంధీ చౌరస్తా భరతమాత చౌరస్తా, సర్దార్ పటేల్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం, వారసంత, పోలీస్ ఠాణా ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

# పత్తి విత్తనంపై పెత్తనం ఎవరిది?

ఖమ్మం : కొద్దిరోజులుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ఈసారి ముందస్తుగా ప్రవేశించే అవకాశం ఉండటంతో దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. భద్రాద్రి జిల్లా చంద్రుగొండ, బూర్గంపాడు, జూలూరుపాడు, ఖమ్మం జిల్లా కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో కొందరు పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటే అలవాటు ఉంది. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు జూన్ 1 నుంచి పత్తి విత్తనాలు విత్తుకోవాలని సూచిస్తున్నారు. ఈసారి అధిక శాతం రైతులు పత్తి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే విపణిలో కర్షకులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో లేవు. ఉభయ జిల్లాల్లో ఏటా సుమారు రూ.100 కోట్ల పత్తి విత్తన వ్యాపారం జరుగుతుంది.

విత్తనోత్పత్తి తగ్గటంతో..

గతేడాది వానాకాలంలో పత్తి విత్తనోత్పత్తి గణనీయంగా తగ్గింది. గత యాసంగిలో వివిధ కంపెనీలు విత్తనోత్పత్తి చేపట్టినా ఈ విత్తనాలు మార్కెట్‌లోకి రావటానికి సుమారు 15 రోజుల సమయం పట్టే అవకాశముంది. గతేడాది వానాకాలంలో తయారుచేసిన అరకొర



పత్తి విత్తనాలు మాత్రమే ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో పత్తి విత్తనాల కొరత ఏర్పడే అవకాశముందని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. విత్తన కంపెనీల డీలర్లతో ఇటీవల సమావేశమయ్యారు. ఏపీలోని అనంతపురం, కర్నూలులో మాదిరిగా తెలంగాణలోని హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో విత్తనోత్పత్తి కంపెనీలు ఉన్నాయి. నిల్వలు తక్కువగా ఉండటంతో కొరత నివారణకు ఆయా కంపెనీలు ముందుగా రాష్ట్ర అవసరాలకు సరఫరా చేశాకే పొరుగు రాష్ట్రాల్లో విక్రయించుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

అధిక ధరలకు పత్తి గింజలు

పత్తి విత్తనాల కొరత నేపథ్యంలో కొందరు రైతులు ప్యాకెట్లను ముందస్తుగా రూ.1,000 చొప్పున చెల్లించి డీలర్ల వద్ద బుక్ చేసుకుంటున్నట్లు సమాచారం. వాస్తవంగా బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ గరిష్ఠ ధర రూ.864 మాత్రమే. అధిక ధరకు బుక్ చేసుకోవటం వల్ల రైతులపై అదనపు భారం పడుతుంది. మండలాలు, రకాల వారీగా నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు వ్యవసాయ శాఖ సూచించింది. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఉన్న నిల్వలను ఒకరిద్దరికే ఎక్కువగా విక్రయించి చేతులు దులుపుకోవద్దని, ప్రతి రైతుకు అందేలా చూడాలని స్పష్టం చేసింది. పత్తిలో మొత్తమ్మీద 80 రకాల విత్తనాలు ఉన్నాయి. అన్ని రకాల హైబ్రిడ్ పత్తి విత్తనాలు దాదాపు ఒకే రకమైన దిగుబడి ఇస్తాయని అధ్యయనాల్లో తేలింది. అయినా కొన్ని కంపెనీలు అధిక దిగుబడి పేరిట కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నాయి. అధిక ధరకు గింజలు అమ్మితే చర్యలు తప్పవని ఖమ్మం డీఏఓ విజయనిర్మల తెలిపారు.

నకిలీల నిరోధానికి..పత్తి విత్తనాల కొరత వేధిస్తుండటంతో కొందరు అక్రమార్కులు ఊరూపేరూ లేని నకిలీ గింజలను విక్రయిస్తున్నారు. వీటిని నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కలెక్టర్లు, ఎస్పీల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీలను ముమ్మరం చేశారు. డివిజన్ స్థాయిలో ఏడీఏల ఆధ్వర్యంలో కమిటీలు పర్యవేక్షిస్తాయి.

# కోతల కాన్పులే అధికం

ఖమ్మం : జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్య కంటే శస్త్రచికిత్సలే అధికంగా ఉంటున్నాయి. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నప్పటికీ శస్త్రచికిత్సలు 30 శాతానికి తగ్గించాలన్న లక్ష్యం నెరవేరటం లేదు. ప్రభుత్వాసుపత్రుల్లో చొరవ లోపించటంతో కోతల కాన్పులే ఎక్కువవుతున్నాయి. కాసుల కక్కుర్తికి అలవాటుపడిన ప్రైవేటు దవాఖానాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. కడుపులోని బిడ్డ బయటకు రావాలంటే శస్త్రచికిత్సే శరణ్యంగా మారింది.

కాసులకు కక్కుర్తి పడి..ప్రైవేటు దవాఖానాల్లో సీ సెక్షన్లను తగ్గించేందుకు సర్కారుకు ప్రత్యేక కార్యాచరణ లేకపోవటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని వసతులున్నాయని అధికారులు చెబుతున్నా సేవల్లో జాప్యం, కొందరు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గర్భిణులు 'ప్రైవేటు' గడప తొక్కుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రులు ఇబ్బడిముబ్బడిగా సీ సెక్షన్లు చేస్తూ రూ.వేలకు వేలు దండుకుంటున్నాయి. సర్కారు దవాఖానాల్లో కొందరు కిందిస్థాయి సిబ్బంది, ఉద్యోగులు కమీషన్లకు ఆశపడి గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే ప్యాకేజీలు నిర్ణయించుకుని మరీ కోతలు కోస్తున్నారు.

కారణాలు అనేకంమూఢనమ్మకాలు, సెంటిమెంట్లు, నొప్పుల భయం వంటి సున్నిత అంశాలపై సరైన అవగాహన కల్పించకపోవటంతో శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయి. శస్త్రచికిత్సల మూలంగా వచ్చే అనర్థాల గురించి ముందే వివరించటంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నా ఆశించిన ఫలితాలు రావటం లేదు. ముఖ్యంగా గర్భిణులు, వారి కుటుంబీకుల్లో భయాన్ని పోగొట్టాలి. కాసేపు పురిటినొప్పులు భరించి సాధారణ కాన్పు చేయించుకోవడం ఎంతో మంచిదనే విషయాన్ని వివరించాలి. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, పథకాలపై అవగాహన కల్పించాలి. సుఖ ప్రసవాలను ప్రోత్సహిస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లాలో సాధారణ కాన్పుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శస్త్రచికిత్సల సంఖ్యను 30 శాతానికి తగ్గించాలనే లక్ష్యం నిర్ణయించాం. వైద్యారోగ్యశాఖ బృందాలు అన్ని ఆసుపత్రులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. గర్భిణులు, వారి కుటుంబీకులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పిస్తున్నాం. డాక్టర్ మాలతి, డీఎంహెచ్ఓ

## రష్మిక వాలు జడ వీపందం కిల్లింగ్

ఆ భారీతనం నిండిన ఆభరణాలు.. చేతి గాజులు.. వేలికి ఉంగరాలు.. మెడలో అలంకారాలు.. అంతకుమించి సాంప్రదాయ చీరకట్టు.. వీటన్నిటినీ ఆ జిలిబిలి నవ్వు డామినేట్ చేసేస్తోంది. ఒకదానికి మించి ఒకటిగా ఒంటిపై ఆభరణాలు పోటీపడుతున్న తరుణంలో ఆ పొడవాటి వాలు జడ, వీపందం అన్నిటినీ అధిగమించాయి. ఓవరాల్ గా రష్మిక మందన లుక్ స్టన్నింగ్ అని పొగిడేయని వారు లేరు. రష్మిక ఎంపిక చేసుకున్న గోల్డ్ కలర్ లెహంగా.. దానికి కాంబినేషన్ గా వైట్ అండ్ గోల్డ్ దుపట్టా.. క్రిస్టలైన్ డిజైన్ తో రూపొందించిన ప్రత్యేకమైన ఈ వస్త్రాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఎంపిక చేసుకున్న దుస్తులకు తగ్గట్టుగానే రష్మిక మేకప్ సంవిధానం అందమైన చిరునవ్వు.. వాలు జడ యాప్ట్ గా ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్‌గా మారుతోంది. ఇంతకుముందే అంబానీల పెళ్లిలో సందడి చేసిన రష్మిక మందన ఇంతలోనే లుక్ ఛేంజ్ చేసి యువతరాన్ని ఆకర్షించింది. జూలై 12 శుక్రవారం తెల్లవారుజామున రష్మిక మందన్న ముంబైకి చేరుకుంది. అక్కడ తన అభిమానులతో ఎంతో ఓపిగ్గా సెల్ఫీలు దిగింది. అందుకు సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉంటే రష్మిక మందన్న తదుపరి ధనుష్‌తో కలిసి కుబేరలో కనిపించనుంది. ఎగ్జైట్‌మెంట్



స్థాయిని పెంచేందుకు మేకర్స్ వరుస అప్‌డేట్‌లను షేర్ చేస్తున్నారు. తాజాగా రష్మిక ఈ చిత్రానికి సంబంధించిన తన ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేసింది. కుబేరలో, ధనుష్ ఒక నిరాశ్రయుడిగా మొదలై చివరికి శక్తివంతమైన మాఫియా లార్డ్‌గా ఎదిగే పాత్రను పోషించాడు. ఈ చిత్రంలో రష్మిక – ధనుష్‌లతో పాటు అక్కినేని నాగార్జున– జిమ్ సర్భ్ కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై సునీల్ నారంగ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కుబేర పాన్–ఇండియన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. విడుదల తేదీని ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే ఇది తమిళం, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రతిభావంతులైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశం, దర్శకత్వ ప్రతిభ వెరసి ఇది మోస్ట్ అవైటెడ్ సినిమాల జాబితాలో నిలుస్తోంది. అల్లు అర్జున్ – ఫహద్ ఫాసిల్ కీలక పాత్రల్లో నటించిన 'పుష్ప: ది రూల్' లోను రష్మిక తిరిగి శ్రీవల్లిగా తన పాత్రతో మైమరిపించనుంది. ఈ చిత్రంలో జగపతి బాబు, ప్రకాష్ రాజ్, సునీల్, ధనంజయ, జగదీష్ ప్రతాప్ తదితరులు నటిస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలోని సస్పెన్స్ చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'లోను రష్మిక నటిస్తోంది. ధీక్షిత్ శెట్టి సరసన కనిపిస్తుంది.

## అంబానీ ఇంట మెరుపులా చందమామ!

చందమామ కాజల్ అగర్వాల్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తూ అవకాశాలు అంది పుచ్చుకుంటుంది. లేడి ఓరియేంటెడ్ చిత్రాల్లో సైతం అవకాశాలు అందుకుని తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తుంది. కానీ అమ్మడికి ఇంకా ఉమెన్ సెంట్రిక్ పరంగా సరైన స్టోరీ పడలేదు. ఇటీవలే సత్యభామ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది కానీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేస్తోంది. అలాగే నెట్టింట కూడా నిత్యం అభిమానులు ఏదో రూపంలో టచ్ లో ఉంటుంది. కొత్త ఫోటోలతో యువతని ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటుంది. మామ్ అయిన తర్వాత ఇన్ స్టా యాక్టివిటీని మరింత స్పీడప్ చేసింది. గర్భందాల్చిన సమయంలోనే తెలివిగా బేబిబంప్ ని ఎన్ క్యాష్ చేసుకుంది. బేబిప్రొడక్ట్ ల్ని ప్రచారం చేస్తూ ఇంట్లో కూర్చునే



సంపాదించేసింది. అంతవరకూ ఏ నటి ఇలాంటి ఛాన్స్ తీసుకోలేదు. కానీ కాజల్ మాత్రం ఈ విషయంలో ఎంతో తెలివిగా వ్యవహారించి కాసులు రాబట్టుకుంది. తాజాగా అంబానీ ఇంట అతిథిగా విచ్చేసిన అమ్మడు ఆ డిజైనర్ దుస్తుల్లో ముస్తాబైన వైనాన్ని నెటి జనులతో పంచుకుంది. ఇదిగో ఇక్కడిలా సంప్రదాయ పంజాబీ డిజైన్ మెరుపు డిజైన్ లో మురుపించింది. మెడలో ధరించిన బంగారు హారం..మ్యాచింగ్ చెవు ఘట్టలు ప్రతీది చందమామ అందాన్ని రెట్టింపు చేసాయి. ఇక మ్యాకప్ పరంగా అంతే జాగ్రత్తలు తీసుకుంది. కళ్లకు ఐటెక్స్.. ఐబ్రోస్..నుదిటిన చిన్న స్టికర్..పెదాలకు ఎర్రని లిప్ స్టిక్ పూసుకుని మరింత ఆకర్షణీయంగా ముస్తాబైంది. శుభ్ ఆశ్వీర్వాద్ లో భాగంగా కాజల్ హాజరైంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. కాజల్ అభిమానుల్ని పిక్ ఆకట్టుకుంటుంది.




## ఉల్లాసంగా నాని, ప్రియాంక.. మెలోడియస్ లిస్ట్ లోకి!




టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం సరిపోదా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా లెవెల్ లో యాక్షన్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. అంటే సుందరానికి మూవీ తర్వాత మరోసారి వీరి కాంబోలో మూవీ రావడంతో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమాలో ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. కానిస్టేబుల్ చారులతగా కనిపించనుంది. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. వరుస అప్డేట్స్ తో సందడి చేస్తున్నారు. అలా మ్యూజికల్ ప్రమోషన్స్ లో భాగంగా సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన గరం గరం సాంగ్ మంచి రెస్పాన్స్ అందుకుంది. చార్ట్ బస్టర్ లిస్ట్ లోకి చేరింది. ఇప్పుడు మరో సాంగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. రీసెంట్ గా మేకర్స్.. సెకండ్ సింగిల్ ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఉల్లాసం అంటూ సాగే ఆ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఫిదా చేస్తోంది. మెలోడియస్? గా సాగుతున్న పాటలో సూర్యగా నాని, చారులతగా ప్రియాంక కనిపిస్తున్నారు. సినిమాలో వీరిద్దరి మధ్య ప్రేమ పుట్టే క్షణాలను సనరే చక్కగా వర్ణించారు. క్రేజీ డైలాగ్ తో మొదలైన సాంగ్.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారింది. నెట్టింట మంచి వ్యూస్ అందుకుంటోంది. నాని మెలోడీస్ లిస్ట్ లో మరో సాంగ్ చేరిందని ఫ్యాన్స్ అండ్ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. నాని, ప్రియాంక జంట మధ్య కెమిస్ట్రీ నెక్స్ట్ లెవెల్ లో ఉందని చెబుతున్నారు. ముచ్చటగా కనిపిస్తున్నారని అంటున్నారు. నాని, ప్రియాంక మోహన్ మధ్య డ్యూయెట్ సాంగ్ గా వచ్చిన ఆ పాటకు మ్యూజిక్ డైరెక్టర్ జేక్స్ బెజోయ్ మంచి మెలోడీ ట్యూన్ ఇచ్చారు. హృదయాన్ని హత్తుకునేలా ఉందనే చెప్పాలి. పాటను సంజిత్ హెగ్డే, కృష్ణ లాస్య ముత్యాల పాడారు. ఇక ఈ సినిమాలో ఎస్ జే సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న మూవీ.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆగస్టు 29వ తేదీన విడుదల అవుతుంది. మరి వరుస హిట్లతో మంచి జోష్ మీద ఉన్న హీరో నాని.. ఈ సినిమాతో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

## దేవర లీకులకి బ్రేక్స్ పడాల్సిందే



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ దేవర షూటింగ్ చివరి దశలో ఉంది. బాలీవుడ్ బ్యూటీ అతిలోక సుందరి కూతురు జాన్వీ కపూర్ దేవర చిత్రంతో టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. హైవోల్టేజ్ యాక్షన్ ప్యాక్డ్ మూవీగా ఈ సినిమాని కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. ఆచార్య లాంటి డిజాస్టర్ తర్వాత కొరటాల శివ నుంచి రాబోతున్న మూవీ కావడంతో తారక్ అభిమానులు క్యూరియాసిటీగా ఎదురుచూస్తున్నారు.

ఎన్టీఆర్ ఏడాది టైం తీసుకొని కొరటాల శివతోనే దేవర చేయడానికి కారణం ఏమై ఉంటుంది తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో ఉంది. ఇదిలా ఉంటే ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత తారక్ నుంచి రాబోయే సినిమా ఇదే కావడంతో మోస్ట్ యాంటిసిపేటెడ్ చిత్రంగా ఈ సినిమా ఉంది. ఇప్పటికే వరల్డ్ వైడ్ గా దేవర సినిమా బిజినెస్ డీల్స్ క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. టేబుల్ ప్రాఫిట్ తో ఈ సినిమాని నిర్మాతలు రిలీజ్ చేయబోతున్నారనే మాట వినిపిస్తోంది.

సెప్టెంబర్ 27న ఈ చిత్రం ఐదు భాషలలో వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. దేవర సినిమా నుంచి ఇప్పటి వరకు వచ్చిన లుక్స్, గ్లింప్స్, సాంగ్ సినిమాపై హైప్ క్రియేట్ చేసాయి. అనిరుద్ రవిచందర్ ఈ సినిమాకి సంగీతం, అందిస్తున్నారు. ఈ మధ్యకాలంలో పెద్ద సినిమాలకి లీకుల సమస్య ఎక్కువ అవుతోంది. దేవర సినిమా షూటింగ్ కి సంబందించిన ఫోటోలు చాలా లీకై బయటకొచ్చాయి. సోషల్ మీడియాలో అవి వైరల్ అయ్యాయి. చాలా సార్లు దేవర మూవీ సెట్ నుంచి ఫోటోలు లీకమయ్యాయి. అయితే తాజాగా దేవర మూవీలో ఎన్టీఆర్ క్యారెక్టర్ కి సంబందించిన ఒక డైలాగ్ బయటకొచ్చిందంట. ప్రస్తుతం దేవర మూవీ డైలాగ్ అంటూ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాన్ ఇండియా లెవల్ లో హై ఎక్స్ పెక్టేషన్స్ మధ్య వస్తోన్న సినిమా నుంచి ఎలాంటి లీకులకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందనే మాట వినిపిస్తోంది. వీటిని లైట్ గా తీసుకుంటే ముమ్ముందు సినిమాకి మరింత ప్రమాదం ఎదురయ్యే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ దేవర మూవీపై చాలా నమ్మకంగా ఉన్నారు.

కచ్చితంగా బ్లాక్ బస్టర్ అయ్యి పాన్ ఇండియా లెవల్ లో తనకంటూ సోలో మార్కెట్ దేవరతో క్రియేట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. కొరటాల శివ కూడా మూవీపైన చాలా హోప్స్ పెట్టుకున్నారు. అయితే ఈ లీకులు మాత్రం అందరిని టెన్షన్ పెడుతున్నాయని తారక్ ఫ్యాన్స్ అంటున్నారు.

## చీరందంలో హీటెక్కించిన హాట్ బ్యూటీ!

తాప్సీ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రొఫెషనల్ గా ఎంత బిజీగా ఉన్నా ప్రయివేట్ ఫోటోలతోనూ అలరించడం అమ్మడి స్పెషాల్టీ. బాలీవుడ్ కి వెళ్లిన నాటి నుంచి ఈ రూల్ తూచ తప్పకుండా ఫాలోఅవుతుంది. అక్కడి ట్రెండ్ ని అనుసరిస్తూ గ్లామర్ వరల్డ్ లో ఇలాగే ఉండాలని ఎన్నోసార్లు ప్రూవ్ చేసింది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదమైన మార్క్ ఎలివేషన్లతో ఆకట్టుకున్న సంద ర్భాలెన్నో. ఉత్తరాది అభిమానుల అభిరుచుకి తగ్గట్టు రూపలావణ్యంలో ఎన్నో మార్పులు చేసింది. మోడ్రన్ దుస్తుల్లో సెగలు పెట్టించిన సందర్భాలు కోకొల్లలు. తాజాగా అమ్మడు చీరందంలో హీటెక్కిస్తోన్న ఫోటోని ఇన్ స్టా వేదికగా వదిలింది. ఇందులో సొగసరి బ్లూ చీర ధరించి విశ్రాంతి తీసుకుటోన్న సమయం ఇదంటూ కుర్రాళ్లలోకి వచ్చేసింది. పాలనురుగల సౌందర్యంపై బులుగు అందం ఆపై కొప్పులో గులాబీ పువ్వు తెరిచిన బ్యూటీతో అలరిస్తుంది. ఈ ఫోటోని ఉద్దేశించి ఇది విశ్రాంతి తీసుకునే సమయం అంటూ



రాసుకొచ్చింది. నెట్ ఫ్లిక్స్ రిలీజ్ హసీన్ -2- ప్రచారంలో భాగంగా అమ్మడు ఇలా తెరపైకి వచ్చింది. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే కొంత కాలంగా బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కంటే బాలీవుడ్ లో బెటర్ గానే కొనసాగుతుంది. అక్కడికి వెళ్లిన తర్వాత సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించి పరిమిత బడ్జెట్ లో సినిమాలు నిర్మిస్తుంది. అక్కడి సెలబ్రిటీలందరితో అంతే మింగిల్ అవుతుంది. అక్కడే స్థిరపడాలి అన్న ఉద్దేశంతో అమ్మడు బాలీవుడ్ లో ముందుకు సాగుతుంది. అందుకు తగ్గ ప్రణాళిక వేసుకుని వెళ్తుంది. దాదాపు గా నాలుగైదేళ్లగా అక్కడే బిజీగా ఉంది. గత ఏడాది ఒకే ఒక్క సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఈ ఏడాది మాత్రం నాలుగైదు సినిమాలో రావడం పక్కాగా కనిపిస్తుంది. ఇప్పటికే కొన్ని కమిట్ అయిన ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవి షూటింగ్ దశలో ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. లాక్ అయితే ఏడాది ముగింపుకల్లా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చేయడం ఖాయం.

## ఒల్లు విరుపులతో అందాల సికిందర్

మాన్ సినిమాతో 1999 సంవత్సరంలో బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ షామా సికిందర్. ఈ అమ్మడు సినిమాలతో కంటే కూడా ఎక్కువగా బుల్లి తెర సీరియల్స్ మరియు షో ల కారణంగా గుర్తింపు సొంతం చేసుకుంది. నాలుగు పదుల వయసులో కూడా పాతికేళ్ల పడుచు అమ్మాయిలా ఈ అమ్మడు కనిపిస్తూ ఉంటుంది. బుల్లి తెర మరియు వెండి తెరపై తనదైన ముద్ర వేసిన షామా సికిందర్ ఇప్పుడు అందాల ఆరబోత ఫోటోలతో సోషల్ మీడియాను కుదిపేస్తుంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తక్కువ కాదు అనిపించుకుంటూ అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో రెచ్చి పోయింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈ



అమ్మడు షేర్ చేసిన ఫోటోల్లో ఒల్లు విరుస్తూ ఫోటోలకు ఇచ్చిన ఫోజ్ లు అందరిని ఆకర్షిస్తున్నాయి. సాదారణంగానే సికిందర్ అందాలు వైరల్ అవుతాయి. ఈసారి అంతకు మించి అన్నట్లుగా స్కిన్ షో చేయడంతో పాటు, కవ్వించే విధంగా ఒల్లు విరుస్తున్న ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అయినా కూడా బాలీవుడ్ లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాకపోవడం వెనుక కారణం ఏంటో అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా షామా సికిందర్ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో ఆఫర్లు సొంతం చేసుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. సినిమాల్లో కాకున్నా కనీసం వెబ్ సిరీస్ ల్లో అయినా ఈ అమ్మడు అందాల ఆరబోత చూడాలని కోరుకుంటున్నామని ఫ్యాన్స్ అంటున్నారు.




దిల్లీ: దేశీయ అతిపెద్ద బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు సోమవారం వెల్లడించింది. కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) వరకు పెంచింది. సవరించిన రేట్లు నేటి (2024 జులై 15) నుంచే అమలవుతాయని ఎస్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్‌ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి, ఆరు నెలల కాలవ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేళ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి, మూడేళ్ల కాలపరిమితి 8.95 శాతం నుంచి 9 శాతానికి ఎస్‌బీఐ పెంచింది. దీంతో ఎంసీఎల్‌ఆర్ ఆధారిత లోన్ల ఈఎంఐలు మరింత భారం కానున్నాయి. ఎస్‌బీఐ ఆటో రుణాలు ఒక సంవత్సరం, వ్యక్తిగత రుణాలు 2 సంవత్సరాల ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానించి ఉన్నాయి.




## డ్రగ్స్‌తో పట్టుబడ్డ హీరోయిన్ రకుల్ సోదరుడు.. అరెస్ట్

హైదరాబాద్ : ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. భాగ్యనగరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సైబరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్ డివిజన్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురు నైజీరియన్లను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే నైజీరియన్ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న మరో ఐదుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడ్డవారిలో సినీరంగానికి చెందిన పలు డ్రగ్స్ కొనుగోలు చేస్తూ పోలీసులకు చిక్కాడు. కాగా.. గతంలో డ్రగ్స్ కేసులో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఆరోపణలు ఎదుర్కున్న విషయం తెలిసిందే. డ్రగ్స్ సరఫరాపై పక్కా సమాచారంతో నార్కోటిక్ బ్యూరో, ఎస్వోటీ, రాజేంద్రనగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 200 గ్రాములకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పలువురు వీఐపీలకు కూడా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




## ఐదు రోజులపాటు తెలంగాణలో భారీ వర్షాలు: వాతావరణశాఖ

హైదరాబాద్: రాగల ఐదు రోజులపాటు ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆగ్నేయ, పశ్చిమ బంగాళా ఖాతంలో అల్పపీడనంతోపాటు షియర్ జోన్ ఏర్పడిందని ఈ ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇవాళ (సోమవారం) కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, జనగాం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 18, 19 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది.

## రూ.7లక్షల కోట్ల అప్పుతో అధికారంలోకి వచ్చాం..



ఖమ్మం: గత పది సంవత్సరాలుగా పాలించిన ప్రభుత్వం గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేడు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రామానికి వెళ్లిన మౌళిక వసతులపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేద వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం వీలైనంత తొందరగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

ధనిక రాష్ట్రం అని చెప్పుకున్న గత ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందన్నారు. గ్రామాలను తీర్చిదిద్దే బాధ్యత ఈ ప్రభుత్వం కచ్చితంగా చేస్తుందన్నారు. వర్షా కాలం కావడంతో సీజనల్ వ్యాధులు వస్తూ ఉంటాయని పొంగులేటి అన్నారు. గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాల విషయమై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారన్నారు. రూ. 7లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే అప్పుల సాకు చూపి వెనకడుగు వేసే ఉద్దేశ్యం మాకు లేదని పొంగులేటి అన్నారు. క్యాబినెట్ స్థాయిలో నిర్ణయాలు తీసుకోకుండా రైతుల వద్దకు వచ్చామన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టే కుట్రలు బీఆర్ఎస్ చేస్తోందన్నారు. వ్యవసాయం ఆదాయంపై ఇన్ కామ్ టాక్స్ కట్టే పరిస్థితిలో రైతు లేదని పొంగులేటి పేర్కొన్నారు.

## బండి సంజయ్‌పై పొన్నం ఘాటు వ్యాఖ్యలు




కరీంనగర్: కేంద్ర మంత్రి బండి సంజయ్.. టీ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. బండి సంజయ్‌పై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నేడు పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ఎన్ని ప్రభుత్వాలను కూల్చిందో అందరికీ తెలుసని.. బండి సంజయ్ మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందని విమర్శించారు. బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే.. చూస్తూ ఊరుకోవాలా? అని నిలదీశారు. తాము ధర్మం తప్పలేదని పొన్నం ప్రభాకర్ అన్నారు. మా పార్టీలో చేరుతున్న వారికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 3 వరకు మాకు ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్న ఆలోచనే తమ ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారన్నారు. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలని స్పష్టం చేశారు. కుల గణన పై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## రాజారాం యాదవ్ సహా విద్యార్థి నాయకుల అరెస్టును ఖండించిన కేటీఆర్



హైదరాబాద్ : నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గ పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వారి సమస్యలను సానుకూల ధృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్బంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల కోసం సెక్రటేరియేట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాం యాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని కేటీఆర్ ఖండించారు. రాజారాం యాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావటం, శాంతియుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలన నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అణిచివేత ధోరణిని సాగిస్తుందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాం యాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని ఇప్పుడు పట్టించుకోవటం మానేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో ఇప్పుడు వాళ్లే ఈ ప్రభుత్వం పతనానికి కారణమవుతారన్నారు. నిరుద్యోగ డిమాండ్లను పరిశీలించకుండా ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే తప్పకుండా బీఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.




## ఐఏఎస్‌లను ప్రశ్నించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్..

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇవాళ దాదాపు 10మంది ఐఏఎస్‌లను విచారించింది. కమిషన్ ఎదుట స్మితా సబర్వాల్, రజత్ కుమార్, వికాస్ రాజ్, రామకృష్ణారావు, రాహుల్ బొజ్జా, ఎస్.కె.జోషి, కంచర్ల రఘు హాజరయ్యారు. ఇందులో పలువురు తాజా, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక నిర్ణయాలు, అమలు చేసిన విధానాలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వారిని ప్రశ్నించింది. నిర్మాణ లోపాలపై కీలక ప్రశ్నలను చంద్రఘోష్ కమిషన్ వారికి సంధించింది. దీనిపై ఐఏఎస్ అధికారులు వివరణ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులపై తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరు తదితర వివరాలను కమిషన్‌కు వివరించారు. అనంతరం ఇప్పటివరకు చెప్పిన వివరాలను అఫిడవిట్ రూపంలో వారం రోజుల్లోగా సమర్పించాలని కమిషన్ ఆదేశించగా.. విచారణకు పూర్తిగా సహకరిస్తామని ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌లు చెప్పారు. అయితే తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మరింత గడువు కావాలని ప్రస్తుత ఫైనాన్స్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు కోరారు. దీంతో ఆగస్టు 5లోపు అఫిడవిట్ సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. విచారణకు స్మితా సబర్వాల్, రజత్ కుమార్, వికాస్ రాజ్, రామకృష్ణారావు, రాహుల్ బొజ్జా, కంచర్ల రఘు ప్రత్యక్షంగా హాజరు కాగా.. ఎస్.కె.జోషి మాత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## యాదగిరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆలయ ఈవో..




యాదాద్రి భువనగిరి జిల్లా: తెలంగాణకే తలమానికంగా విరాజిల్లుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండ చుట్టూ సామూహిక గిరి ప్రదక్షిణ సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో భాస్కరరావు పాల్గొన్నారు. వందలాది భక్తులతో కొండ చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. వైకుంఠ ద్వారం దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ముఖ మండపంలో స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో 108 కలశాలకు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం శతఘటాభిషేకం పూజలు చేశారు. వివిధ ఫలరసాలు, పంచామృతాలు, ఫల జలములు, శుద్ధ జలంతో స్వామి అమ్మవార్లను అభిషేకించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా గత నెల చేపట్టిన గిరిప్రదక్షిణలో ఊహించని రీతిలో 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో గిరి ప్రదక్షిణలో భారీగా భక్తులు పాల్గొన్నారు. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు కొనసాగే ఈ గిరి ప్రదక్షిణ సోమవారం ఉదయం 6.05 గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభమైంది.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతోపాటు ఈవో భాస్కరరావు పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ సమయంలో వ్రత మండపం, సంస్కృత పాఠశాల, అన్నదాన సత్రం, గిరిప్రదక్షిణ రోడ్డుకు ఇరువైపులా, మల్లాపురం వద్ద గోశాల తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు వేల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

## వికారాబాద్‌లో టూరిస్టులకు వింత కష్టాలు!



వికారాబాద్, జూలై 15: జిల్లాలో పర్యాటకుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వీకెండ్ కావడంతో ఎంజాయ్ చేద్దామని వెళ్లిన వారు... అక్కడ మట్టిలో ఇరుక్కుపోయి నానా ఇబ్బందులు పడ్డారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కోట్‌పల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కాలువలో అనేక వాహనాలు ఇరుక్కుపోయాయి. రాత్రంతా బురదలో నుంచి తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వాహనాలను వాహనదారులు అక్కడే వదిలేయక తప్పలేదు. హైదరాబాద్ నుంచి వికారాబాద్ ప్రాంతంలో కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతంలోకి యువత ఎంజాయ్ చేయడానికి వచ్చారు. నిన్న సాయంత్రం వాహనదారులు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కాలువ దాటి వెళ్లారు. అయితే రాత్రి భారీ వర్షం పడడంతో తిరుగు ప్రయాణంలో అక్కడి నల్ల మట్టిలో ఇరుక్కుపోయారు. వాహనాలను తీయడానికి శతవిధాలుగా ప్రయత్నించినా నిరాశే ఎదురైంది. దీంతో చేసేదేం లేక వాహనాలను అక్కడే వదిలేశారు. దీంతో తెల్లారేసరికి వాహనాలు నీట మునిగాయి. ఎంజాయ్ చేద్దాం అని వస్తే వాహనాలు నీటిలో మునడంతో కంగుతినడం యువత వంతైంది. మూడు మహేంద్ర తార్‌తో పాటు ఓ ట్రాక్టర్ నీటిలో మునిగింది. ట్రాక్టర్‌ను గ్రామస్తులు తాడుతో ఒడ్డుకు తీయగా... తార్ వాహనాలు బురదలోనే ఉండిపోయాయి.

## సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు బూమరాంగ్ అవుతున్నాయి



హైదరాబాద్, జూలై 15: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు బూమరాంగ్ అవుతున్నాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసి హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారన్నారు. హైడ్రా ఏర్పాటును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందన్నారు. స్థానిక సంస్థల స్ఫూర్తికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూకబ్జాలు, అవినీతి చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. శివారు ప్రాంతాలను విలీనం చేయడం ద్వారా ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. గ్రేటర్ పరిధిలో పారిశుద్ధ్యం లోపించిందని.. విష జ్వరాలు విజృంభిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఏడు నెలల పాలనలో హైదరాబాద్‌కు ఒక్క కంపెనీ రాలేదన్నారు. రేవంత్ రెడ్డి మారువేషంలో ప్రజల వద్దకు వెళ్ళి వాస్తవాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద హితవుపలికారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com